తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం-29- డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 211 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



## అసెంబ్లీ సమావేశాలకు మాజీ సీఎం కేసీఆర్ హాజరు

- ఎర్రవెల్లి ఫాంహౌస్ నుంచి నందినగర్‌కి కేసీఆర్ ప్రయాణం
- రేపటి అసెంబ్లీ సెషన్‌కు కేసీఆర్ హాజరు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిమిత హాజరు
- అసెంబ్లీకి రాకపోవడంపై కాంగ్రెస్ విమర్శలు

2లో

# నీటిపారుదల అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

- నీటిపారుదల శాఖపై ప్రత్యేక దృష్టి
- నదీ జలాల వాటా, ఏపీతో వివాదాలపై చర్చ
- బీఆర్ఎస్ హయాంలో తీసుకున్న నిర్ణయాలపై ఆరా
- పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సమీక్ష
- ప్రాజెక్టుల పురోగతి, గత రెండేళ్ల పనుల వివరాల పరిశీలన
- ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజెంటేషన్‌పై చర్చ

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

నేటి నుంచి తెలంగాణలో శాసనసభ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ అంశాలపై సమీక్ష చేపట్టారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు ఈసమీక్షలో పాల్గొన్నారు. నదీ జలాలు, ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు.

మిగతా 2లో





## ఐబొమ్మ రవి కేసులో మరో బిగ్ ట్విస్ట్

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

ఐబొమ్మ రవి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మరో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రహ్లాద్ అనే వ్యక్తి డాక్యుమెంట్లు ఇమంది రవి దొంగిలించినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రహ్లాద్ వెల్లేల పేరిట ఇమంది రవి.. పాన్, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నట్లు తేలింది. బెంగుళూరు నుంచి ప్రహ్లాద్‌ను పోలీసులు పిలిపించారు.

2లో

# మేడారం జాతరకు పోటెత్తిన భక్తులు

- మేడారం జాతరకు భక్తుల పోటెత్తు
- సెలవుదినంతో భారీగా తరలివచ్చిన భక్తులు
- 200 మంది పోలీసులతో ప్రత్యేక భద్రత
- భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ
- సమ్మక్క–సారలమ్మ జాతర తేదీల వివరాలు
- ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు
- ముందుగానే అమ్మవార్ల దర్శనాలు
- జాతరను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వ ఏర్పాట్లు

2లో



## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమితో అధైర్యపడొద్దు

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- కాంగ్రెస్ గెలుపొందిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు సన్మానం
- కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి విమర్శలు
- కాంగ్రెస్ నాయకులు ప్రజల్లో మమేకమవ్వాలని పిలుపు
- సాగునీటి కాల్వల అభివృద్ధికి రూ.480 కోట్ల నిధులు
- వలిగొండ–కాటేపల్లి మధ్య నూతన బీటీ రోడ్డుకు ప్రారంభం
- కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు
- భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతోందన్న కుంభం వ్యాఖ్య
- కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం, భారీ ర్యాలీ

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లుగా ఓడిన వారు అధైర్యపడవద్దని, ఓటమి విజయానికి నాంది కావాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధైర్యం చెప్పారు. ఆదివా రం మండల కేంద్రంలో

మిగతా 2లో





## దక్షిణ మధ్య రైల్వేకు 19,314 కోట్ల ఆదాయం

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

దక్షిణ మధ్య రైల్వే ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు రికార్డు స్థాయిలో రూ.19,314 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. గత ఏడాది ఇదేకాలంలో వచ్చిన ఆదాయం (రూ.18,831 కోట్లు)కన్నా ఇది రూ.483 కోట్లు ఎక్కువ. ఈసారి ప్రధానంగా 136.2 మిలియన్ టన్నుల సరకు రవాణాతో రూ.12,841 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రయాణికుల నుంచి చార్జీల ద్వారా రూ.5,525 కోట్ల ఆదాయం వచ్చినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

7లో

## జనవరి 1 నుంచి నుమాయిష్ ప్రారంభం

- 85వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన–2026కు సిద్ధం
- జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు నుమాయిష్ నిర్వహణ
- 45 రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ప్రదర్శన
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభం
- ప్రవేశ టికెట్ ధర రూ.50, ఐదేళ్లలోపు పిల్లలకు ఉచితం
- సందర్శకుల కోసం మౌలిక వసతులు, ప్రత్యేక ఏర్పాట్లు
- ప్రత్యేక ఆర్టీసీ బస్సులు, రాత్రి 11 వరకు మెట్రో సేవలు
- వివిధ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ సదుపాయం
- నుమాయిష్ ద్వారా ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

దేశంలోనే అతి పెద్దదైన ప్రతిష్ఠాత్మక 85వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన2026 నుమాయిష్‌ను వచ్చే జనవరి 1 సాయంత్రం నుంచి ప్రారంభించనున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు, మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్, వ్యాపారం, వినోదం, విజ్ఞానం వంటి వాటికి వేదికగా నిలుస్తున్న ఈ నుమాయిష్ ఫిబ్రవరి 15 వరకు వరుసగా 45 రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

మిగతా 2లో

## కాంగ్రెస్ సర్కార్, సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఘాటు విమర్శలు



- విద్య, రైతాంగంపై కాంగ్రెస్ పాలనపై విమర్శలు
- యూరియా కొరతపై ఆవేదన
- పాలమూరు బిడ్డ పేరుతో మోసం చేశారని ఆరోపణ
- నాగర్‌కర్నూల్ జిల్లాలో కేటీఆర్ పర్యటన
- సర్పంచుల సన్మాన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేటీఆర్
- పార్టీ శ్రేణుల్లో ఉత్సాహంపై కేటీఆర్ వ్యాఖ్యలు
- పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై తీవ్ర విమర్శలు

2లో



## ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక వస్తే తప్పకుండా గెలుస్తా

### ఎమ్మెల్యే దానం నాగేందర్ ధీమా

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక వస్తే తప్పకుండా గెలుస్తానని ఎమ్మెల్యే దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలే తన బలమని, వారి వల్లే ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, ఈ స్థాయిలో ఉన్నానని అన్నారు. శనివారం హిమాయత్‌నగర్ డివిజన్‌లోని విఠల్‌వాడిలో ఉన్న మేల్కొటె పార్క్‌ను కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్‌తో కలిసి సందర్శించారు.

2లో

# ఈ ఏడాది భారత్‌కు గర్వకారణం

- 'మన్ కీ బాత్' 129వ ఎపిసోడ్‌లో కీలక ఘట్టాల ప్రస్తావన
- జాతీయ భద్రతలో ఆపరేషన్ సిందూర్ ప్రాధాన్యం
- క్రీడల్లో భారత్ చరిత్రాత్మక విజయాలు
- మహిళల, దివ్యాంగ క్రీడాకారుల ఘనత
- సైన్స్, అంతరిక్ష రంగాల్లో భారత్ ముందడుగు
- చిరుతపులుల సంఖ్య పెరుగుదలపై ప్రధాని వ్యాఖ్య
- మహా కుంభమేళా, అయోధ్య రామమందిరంపై ప్రశంసలు
- ప్రపంచం భారత్‌వైపు ఆశగా చూస్తోందన్న మోదీ
- యువ శక్తిపై ప్రధాని విశ్వాసం

న్యూఢిల్లీ: , (తెలంగాణ ముచ్చట్లు)

భారత్ గర్వించదగిన, చిరస్మరణీయమైన ఎన్నో మైలురాళ్లను 2025 అందించిందని ప్రధాని మోదీ అన్నారు. ఆదివారం ప్రసారమైన ఈ ఏడాది చివరి 'మన్ కీ బాత్' 129వ ఎపిసోడ్‌లో ఆయా కీలక ఘట్టాలను ఆయన గుర్తుచేసుకున్నారు. జాతీయ భద్రత, క్రీడలు, సాంకేతిక ఆవిష్కరణలతో పాటు ప్రపంచంలోని అతిపెద్ద వేదికలపై ఈ ఏడాది భారతదేశం ప్రభావం స్పష్టంగా కనిపించిందని తెలిపారు. ప్రతి భారతీయుడికి గర్వకారణమైన ఆపరేషన్ సిందూర్... భద్రత విషయంలో దేశం రాజీ పడదని ప్రపంచానికి చాటి చెప్పిందని పేర్కొన్నారు. జాతీయ గేయమైన వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు కూడా ఇదే స్ఫూర్తి కనిపించిందని చెప్పారు.

మిగతా 7లో



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మేడారం జాతరకు పోటెత్తిన భక్తులు

(మొదటి పేజీ తరువాయి)



మేడారం సమ్మక్కసారక్క జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతో అమ్మవార్లని దర్శించుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలివచ్చారు. దీంతో జిల్లా యంత్రాంగం 200మంది పోలీసులతో ప్రత్యేక భద్రత ఏర్పాటు చేసింది. ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ స్వయంగా భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వాస్తవానికి సమ్మక్కసారలమ్మ అమ్మవార్ల జాతర వచ్చే ఏడాది జనవరి 28న సారలమ్మ రాకతో ప్రారంభం అవుతుంది. 29న సమ్మక్క దేవత గద్దెలపైకి వస్తుంది. 30న భక్తులు మొక్కులు సమర్పించుకుంటారు. 31వతేదీన అమ్మవార్ల వనప్రవేశంతో జాతరముగుస్తుంది.

సమ్మక్కసారలమ్మ జాతర ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా భావిస్తారు. జాతర సందర్భంలో కోట్ల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ సందర్భంగా ముందుగానే భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. ఈ ఏడాది అమ్మవార్ల జాతరను ప్రభుత్వం అత్యంత వైభవంగా జరపాలని సంకల్పించింది. జాతర ఏర్పాట్లకోసం ఇప్పటికే ప్రత్యేక నిధులు మంజూరు చేసింది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమితో అధైర్యపడొద్దు

(మొదటి పేజీ తరువాయి)



శ్రీవేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భువనగిరి, వలిగొండ మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా బరిలో నిలిచి గెలుపొందిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ ఎన్నికల్లో ఓడిపోగానే ఫాంహౌస్ నుంచి బయటికి రాలేదని విమర్శించారు. కాం గ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో మ మేకమై పోవాలన్నారు. గతంలో కేంద్రంలో 50 మంది ఎంపీలు ఉన్న మల్లికార్జున ఖర్గే, రాష్ట్రం లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న భట్టి విక్రమార్క అధైర్యపడకుండా నాటి ప్రభుత్వాల ను చట్టసభల్లో నిలదీసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ ప్రాంత రైతుల కోరిక మేరకు రూ.480కోట్ల విడుదల చేసి సాగునీటి కాల్వల అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్పష్టంచేశారు. అంతకు ముందు వలిగొండ నుంచి కాటేపల్లి వరకు 15 కిలోమీటర్ల పొడవుతో రూ.49.5కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ప్రవాస భారతీయుడు డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీమా నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య, సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి, నాయకులు జహంగీర్, ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకు, గ్రాఫ్ పెరుగుతోందని ఎమ్మె ల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో గత 40 ఏళ్లలో టీడీపీ, బీఆర్ఎస్ గెలుపొందారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలవడం వల్ల ఆ చరిత్రను తిరగరాశామని గుర్తుచేశారు. తనకంటేముందుగా ఎంపీలుగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి గెలుపొంది కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు సుస్థిరం చేశారని కొనియాడారు. తొలుత మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. టపాసులు కాల్చారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు.

**పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : చామల**


ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాల ని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అం దేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని వివరించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులే కాక రాష్ట్ర ప్రభుత్వ నిధులు కూడా గ్రామాలకు అందుతాయన్నారు.

# జనవరి 1 నుంచి నుమాయిష్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దీన్ని ప్రారంభిస్తారని, మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డితోపాటు పలువురు పాల్గొంటారని తెలిపారు. ఎగ్జిబిషన్ మైదానం గాంధీ సెంటినరీ హాల్ వేదికగా శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన నుమాయిష్ వివరాలు వెల్లడించారు. రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు నుమాయిష్ తెరిచి ఉంటుందని, శని, ఆదివారాలు, ప్రభుత్వ సెలవు రోజుల్లో రాత్రి 11 గంటల వరకు ఉంటుందని ఆయన వివరించారు. ప్రవేశ టికెట్ ధర రూ.50 అని, ఐదేళ్ల లోపు పిల్లలకు ఉచితం అని పేర్కొన్నారు. నుమాయిష్‌ను సందర్శించేందుకు లక్షల సంఖ్యలో వచ్చే సందర్శకులకుఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. సందర్శకుల సౌకర్యార్థం రాకపోకలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుస్తాయని, అదేవిధంగా మెట్రో రైళ్లను రాత్రి 11 గంటల వరకు నడుపుతారని చెప్పారు. వాహనాల పార్కింగు గృహకల్ప, చంద్రవిహార్, గగన్ విహార్, భీంరావుబాడ ఖాళీ స్థలాల్లో చేసుకోవచ్చన్నారు. నుమాయిష్ ద్వారా 2024, 2025 సంవత్సరాల్లో వివిధ పన్నుల ద్వారా ప్రభుత్వానికి రూ.10 కోట్ల ఆదాయం సమకూరిందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి రాజేశ్వర్, జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు సుఖేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక వస్తే తప్పకుండా గెలుస్తా

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి హెచ్ఎండీఏ డీఈ విశ్వనాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఖైరతాబాద్ డీసీసీ నూతన అధ్యక్షుడు రోహిత్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డితో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గెలిపించడం, ఓడించడం అనేది ప్రజలు చూసుకుంటారన్నారు.

సీఎంను ఉద్దేశించి బీఆర్ఎస్ నాయకులే ఏకవచనంతో మాట్లాడారని, ముఖ్యమంత్రి పదవికి గౌరవం ఇవ్వాలని, అది మరిచి విమర్శలు చేస్తే ప్రతి విమర్శలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కేటీఆర్ వ్యక్తిగత విమర్శలు మానుకొని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. ఇద్దరు రాష్ట్ర మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆరోపిస్తున్నారని, ఆయన పరిధిలోనే దర్యాప్తు సంస్థలు ఉన్నాయని, ఆధారాలు ఉంటే విచారణ చేపట్టాలని సవాల్ విసిరారు.

# నీటిపారుదల అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)



నదీ జలాల్లో వాటా, ఏపీతో వివాదాలు, బీఆర్ఎస్ హయాంలో అనుసరించిన విధానాలు, తీసుకున్న నిర్ణయాలు, తదితర అంశాలపై సీఎం ఆరా తీశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా సమీక్షించారు. సమావేశాల్లో ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉన్న తరుణంలో అందుకు సంబంధించిన అన్ని అంశాలపై దృష్టి సారించారు. ప్రాజెక్టు ప్రతిపాదించినప్పటి నుంచి పరిణామాలు, బీఆర్ఎస్ హయాంలో నిర్ణయాలు, పురోగతి, గత రెండేళ్లుగా పనులు.. ఇలా అన్ని వివరాలు తీసుకున్నారు. సాగునీటి ప్రాజెక్టులపై గురువారం ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇవ్వనున్న ప్రజెంటేషన్‌కు సంబంధించి కూడా చర్చ జరిగినట్లు తెలిసింది.

# అసెంబ్లీ సమావేశాలకు మాజీ సీఎం కేసీఆర్ హాజరు




హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు): నేటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలలో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొననున్నట్లు బీఆర్ఎస్ తెలిపింది. అసెంబ్లీ సమావేశాలలో పాల్గొనడం కోసం కేసీఆర్ ఎర్రవెల్లి ఫాంహౌస్ నుంచి నందినగర్‌లో గల తన నివాసానికి బయిలుదేరినట్లు పేర్కొంది. రేపు జరిగే అసెంబ్లీ సెషన్‌కు అక్కడి నుంచి కేసీఆర్ హాజరు కానున్నట్లు అధికారికంగా వెల్లడించింది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కేవలం రెండుసార్లు మాత్రమే కేసీఆర్ అసెంబ్లీ సెషన్లకు హాజరయ్యారు. తొలిసారి గవర్నర్ ప్రసంగానికి హాజరవ్వగా రెండోసారి బడ్జెట్ ప్రసంగానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు సైతం గుప్పించింది.

కాగా ఇటీవలే కేసీఆర్ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై చర్చించారు. వాటితో పాటు రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను ఆరాతీశారు. అసెంబ్లీ సమావేశాల్లో నీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా బీఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్ సర్కార్, సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఘాటు విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ సర్కార్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఆంధ్రాలో చదివితే రేవంత్‌రెడ్డికి వచ్చిన నొప్పేంటని ప్రశ్నించారు. మరి అప్పట్లో కాంగ్రెస్ పాలనలో మన తెలంగాణలో మంచి విద్య లేకుండా చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వంలో రైతు రాజ్యం ఉందని... కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాబందుల రాజ్యం వచ్చిందని ఎద్దేవా చేశారు. యూరియా దుకాణాల ఎదుట చెప్పుల లైన్లు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి రాజ్యం తెస్తామని చెబితే ఏమో అనుకున్నామని.. కానీ ఇలా చూస్తామని అనుకోలేదని విమర్శించారు కేటీఆర్.

అడ్డమైన హామీలు ఇచ్చి మీ పాలమూరు బిడ్డ అని రేవంత్‌రెడ్డి మోసం చేసి గెలిచారని ఆక్షేపించారు. ఎన్నో హామీలు ఇచ్చారని.. కానీ ఇప్పుడు ఆయన అసభ్యంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అధ్యక్షతన సర్పంచుల సన్మాన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పార్టీ శ్రేణుల ఉత్సాహం చూస్తుంటే తన కడుపు నిండి పోయిందని.. కేసీఆర్ మళ్లా సీఎం అయినట్లుగా ఉందని చెప్పుకొచ్చారు.

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కేసీఆర్ 70 టీఎంసీల రిజర్వాయర్‌లను ఐదు కట్టారని గుర్తు చేశారు. 90 శాతం పనులు పూర్తి చేసి.. ఒక పంపుకు కూడా బటన్ ఆన్ చేశారని ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి మరి రెండేళ్లలో ఒక్క తట్టెడు మట్టి కూడా ఎందుకు తీయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తన పాత బాస్‌కు కోపం వస్తుందనే కారణంతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రేవంత్‌రెడ్డి పక్కన పెట్టారని ఆరోపణలు చేశారు. 1952లో బూర్గుల రామకృష్ణారావు 150 టీఎంసీలతో అప్పర్ కృష్ణా ప్రాజెక్టుకు ప్రణాళిక సిద్ధం చేశారని అన్నారు. కానీ 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత అప్పర్ కృష్ణా ప్రాజెక్టును కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్‌కు పేరు వస్తోందనే కారణంతో పాలమూరు ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని ఆరోపించారు కేటీఆర్.

రేవంత్‌రెడ్డికి పాలమూరు మీద ప్రేమ లేదని... ఆయనకు భూములు, రియల్ ఎస్టేట్‌ల మీద మాత్రమే ప్రేమ ఉందని విమర్శించారు. . ప్రజల్లో ఆదరణ లేకపోవడంతోనే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఈ ఫలితాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎంపీటీసీ, జెడ్పీటీసీలు 32 జిల్లా పరిషత్‌లు గెలిచామని గుర్తుచేశారు. మరి ఇప్పుడు కాంగ్రెస్ ఎన్ని సర్పంచ్ స్థానాలు గెలిచిందో తెలిసిందేనని అన్నారు. రెండేళ్లలోనే ప్రజలు మళ్లీ కేసీఆర్‌కు పట్టం కట్టాలని చూస్తున్నారని చెప్పుకొచ్చారు. ఆయన పాలనలో ప్రతీ పల్లె ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. పలు ప్రాజెక్టులు ఇప్పుడు మొత్తం కంప చెట్లు మొలిచి ఆగం ఆగం అయ్యాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## ఐబొమ్మ రవి కేసులో మరో బిగ్ ట్విస్ట్



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు): ఐబొమ్మ రవి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మరో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రహ్లాద్ అనే వ్యక్తి డాక్యు మెంట్లు ఇమంది రవి దొంగిలించినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రహ్లాద్ వెల్లేల పేరిట ఇమంది రవి.. పాన్, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నట్లు తేలింది. బెంగుళూరు నుంచి ప్రహ్లాద్‌ను పోలీసులు పిలిపించారు.

కస్టడీలో ఉన్న ఇమంది రవి ఎదుటే ప్రహ్లాద్‌ను పోలీసులు విచారించారు. రవి ఎవరో తనకు తెలియదని ప్రహ్లాద్ పోలీసులకు చెప్పాడు. అయితే, ప్రహ్లాద్ తన రూమ్ మేట్ అని గతంలో రవి.. విచారణలో చెప్పిన సంగతి తెలిసిందే. తన పేరుతో రవి పాన్, లైసెన్స్ తీసుకున్నట్లు తెలిసి షాక్‌కు గురయ్యానంటూ ప్రహ్లాద్.. పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. రేపటితో(డిసెంబర్ 29, సోమవారం) ఐబొమ్మ రవి కస్టడీ ముగియనుంది.

కాగా, ఆంధ్రప్రదేశ్ వైజాగ్‌వాసి అయిన ఇమ్మడి రవి.. ఐబొమ్మ, బప్పం అనే వెబ్‌సైట్లతో సినీ పైరసీకి పాల్పడ్డాడు. ఇటు పైరసీతో పాటు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసి కోట్లకు పడగలెత్తాడు. ఇందుకు కరేబియన్ దీవులను ఎంచుకుని అక్కడి నుంచి సర్వర్లు, థర్డ్ పార్టీ ద్వారా వ్యవహారం నడిపించాడు. పలు విడతలుగా జరుపుతున్న విచారణలో రవి నుంచి పోలీసులు కీలక సమాచారాన్నే రాబడుతున్నారు.

సినిమాను బొమ్మగా పిలుస్తారు కాబట్టే ఐబొమ్మ అని పేరు పెట్టానని.. బలపం కాస్త బప్పం అయ్యిందని.. ఇలా పలు ఆసక్తికర సంగతులను రవి వెల్లడించిన సంగతి తెలిసిందే. అలాగే.. స్క్రీన్ రికార్డింగ్ ద్వారా ఓటీటీ కంటెంట్‌ను సైతం పైరసీ చేయగలిగానంటూ కస్టడీ విచారణలో సైబర్ పోలీసులకే రవి అత్యాధునిక టెక్నాలజీ పాఠాలను నేర్పించడం సర్వత్రా ఆసక్తిని రేకెత్తించింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక


# మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన వనపర్తి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనుజ్ఞారెడ్డి






**పెద్దమందడి,డిసెంబర్28(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చీకరు చెట్టు తాండలో వనపర్తి బిజెపి కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి అనుజ్ఞా రెడ్డి, తాండ సర్పంచ్ లలిత కిషన్ నాయక్‌తో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా అనుజ్ఞా రెడ్డి మాట్లాడుతూ..మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలతో నేరుగా మమేకమై వారి విజయాలు, సేవా కార్యక్రమాలు, ప్రేరణాత్మక అంశాలను పంచుకుంటున్నారని అన్నారు. సమాజంలో మార్పు తీసుకొచ్చే సాధారణ ప్రజల కథలను దేశవ్యాప్తంగా పరిచయం చేయడం ద్వారా ప్రజల్లో దేశభక్తి, సామాజిక బాధ్యతను మరింత పెంపొందిస్తున్నారని పేర్కొన్నారు.అలాగే యువత, మహిళలు, రైతులు, గిరిజనులు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్న సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా ఇస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజలు చైతన్యవంతులుగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామస్తులు పాల్గొని మన్ కీ బాత్ ప్రసంగాన్ని ఆసక్తిగా వీక్షించారు.

# ఎల్కతుర్తి మండలంలో గ్రామాల దుస్థితి





◆ **మౌలిక వసతుల లేమితో అల్లాడుతున్న గ్రామాలు**

**ఎల్కతుర్తి, డిసెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో మౌలిక వసతుల లోపం గ్రామస్తుల జీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా మురికి కాలువల సమస్య ప్రతి గ్రామంలోనూ తారాస్థాయికి చేరింది. కాలువలను శుభ్రం చేయకపోవడం, చాలా ప్రాంతాల్లో కాలువలే లేకపోవడంతో మురికి నీరు నేరుగా రోడ్లపైకి చేరి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది.

మండలంలోని అనేక గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారాయి. రోడ్లపై మురికి నీరు నిలిచిపోవడం, ప్రవహించడం వల్ల దుర్గంధం వ్యాపించి పరిసరాలు కాలుష్యంగా మారుతున్నాయి. రోడ్లకు ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోయి గ్రామాలు అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. చెత్త కుండీలు నిండిపోవడం, డంపింగ్ యార్డులు నివాస ప్రాంతాలకు అతి సమీపంలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్ల పక్కన నియంత్రణ లేకుండా పెరిగిపోయిన చెట్లు, నిలిచిపోయిన మురికి నీటి కారణంగా దోమల సమస్య తీవ్రరూపం దాల్చింది. దోమల ప్రభావంతో జ్వరాలు, ఇతర అంటువ్యాధులు పెరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రత లోపంతో నిత్యం అష్టకష్టాలు పడుతున్నామని వాపోతున్నారు. అంతేకాక కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య కూడా ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

గత కొన్ని నెలలుగా గ్రామాల్లో సర్పంచులు లేకపోవడంతో అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో గ్రామాల పురోగతి అక్కడికక్కడే ఆగిపోయిందని వాపోతున్నారు. సమస్యలు ఉన్నప్పటికీ వాటిపై స్పందించే స్థాయి లేకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో నిధుల కొరత ఏర్పడింది. ఈ కారణంగా అనేక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని సమాచారం. సర్పంచులు ఉన్నప్పటికీ నిధులు విడుదల కాకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇటీవల కొత్త సర్పంచులు బాధ్యతలు చేపట్టడంతో గ్రామపంచాయతీలు మళ్లీ చురుగ్గా మారతాయనే ఆశ గ్రామస్తుల్లో నెలకొంది. ఇకనైనా గ్రామాల్లో అభివృద్ధి పనులు మొదలవుతాయా? మురికి కాలువలు, చెత్త సమస్యలు పరిష్కారమవుతాయా? పరిశుభ్రత, మౌలిక వసతులు మెరుగుపడతాయా? అనే ప్రశ్నలు గ్రామ ప్రజలను వెంటాడుతున్నాయి. ఇకనైనా పాలకులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎల్కతుర్తి మండలంలోని గ్రామాల దుస్థితిని మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకపోతే ఈ సమస్యలు మాటలకే పరిమితమవుతాయా? అనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

# మల్లాపూర్‌లో ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**మల్లాపూర్, డిసెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించు కుని మల్లాపూర్ ఎస్‌వీ నగర్ కాలనీలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం నిర్వహించారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధన నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజాసేవనే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, లౌకిక విలువల పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ఆశయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా ఎస్సీ సెల్ అడ్వైసర్ పీజీ సుదర్శన్, జిల్లా మాజీ ఓబీసీ సెల్ చైర్మన్ బొంగొని ఉమేష్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి సద్గుణ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, దంతూరి రాజు గౌడ్, మెరుపుల బాలరాజ్, కోయలకొండ రాజేష్, ఎస్‌వీ కిట్టు, పర్వతాలు, ధనుంజయ్, నుస్రత్ ఖాన్, శివరాజ్, ఖయ్యుమ్, లక్ష్మీపతి, శ్రీనివాస్, ఫిరోజ్, సురేష్, జానీ, మోహన్, శేఖర్, నాగరాజ్, సందీప్, మహేష్, ప్రవీణ్, అక్బర్, అన్వర్, శివ, నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.అలాగే మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కప్పరా సాయి కిరణ్ గౌడ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు మహేష్ నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మనోహర్, ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కోయగూర బాలరాజ్ గౌడ్, ఉపాధ్యక్షులు జోష్ విక్టర్, జానీ భాయ్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, కార్యదర్శి రుపేందర్ రెడ్డి పాల్గొని వేడుకలకు శోభ చేకూర్చారు.మహిళా నాయకురాళ్లు జమీలా బేగం, నిర్మల రెడ్డి, శైలజ, సోనీ, శ్రావణి గౌడ్, ఇష్రాత్ బానో, ఇంతియాజ్ బేగం కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.ఈ వేడుకల్లో మల్లాపూర్ కాంగ్రెస్ అభిమానులు, స్థానికులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీపై తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## గంగవరం రామకృష్ణారెడ్డి రచించిన "ఖాళీ కుర్చీ" కవితా సంపుటి ఆవిష్కరించిన మాజీమంత్రి



**వనపర్తి,డిసెంబర్28(తెలంగాణ ముచ్చట్లు):** గంగవరం రామకృష్ణారెడ్డి రచించిన "ఖాళీ కుర్చీ" కవితా సంపుటి ఆవిష్కరణ వనపర్తి టి.ఎన్.జి.ఓ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. సరళమైన భాషలో సున్నితమైన సామాజిక అంశాలను స్పృశిస్తూ రచించిన "ఖాళీ కుర్చీ" కవితా సంపుటి అభినందనీయమని అన్నారు. వాగ్దానాల భంగానికి, అధికార ధర్మానికి 'ఖాళీ కుర్చీ' మౌన సాక్షిగా నిలుస్తుందని, ప్రజాప్రతినిధులు సామూహిక బాధ్యతలను గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.కవితా సంపుటి చిన్నదైనా లోతైన అర్థంతో సమాజానికి మంచి సందేశం ఇస్తుందని తెలిపారు. రచయిత గంగవరం రామకృష్ణారెడ్డి మరింత మంచి రచయితగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సభ సాహితీ కళా వేదిక అధ్యక్షులు పలుస. శంకర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి, డా. వీరయ్య, నారాయణరెడ్డి, డా. సురేష్ విశ్వ, నాయకంటి నరసింహ శర్మ, బైరోజు చంద్రశేఖర్, గంధం నాగరాజు, నందిమల్ల అశోక్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, సుగురు మురళీ సాగర్, జోహెబ్ హుస్సేన్, మంద రాము తదితరులు పాల్గొన్నారు.

## మనిగిల్లలో ప్రజా సమస్యలపై దృష్టి



◆ **మార్నింగ్ వాక్ లో సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్**

**పెద్దమందడి,డిసెంబర్28(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామంలో నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ మరియు ఉపసర్పంచ్ గణేష్ ఆధ్వర్యంలో మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించి, ఎనిమిదో వార్డును సందర్శించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సూచనలు ఎంతో కీలకమని సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ పేర్కొంటూ, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని భరోసా ఇచ్చారు.ప్రజలతో నేరుగా సంప్రదింపులు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మనిగిల్ల గ్రామ బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ముఖ్యంగా 2వ వార్డు నెంబర్ శ్రీకాంత్ రెడ్డి, బోయిన కృష్ణయ్య, బీకే ప్రేమ్ కుమార్ రెడ్డి, బోడి గణేష్, కావలి శివ శంకర్, మండల తిరుపతయ్య, ఎం. రవికుమార్, మందడి సాయి కుమార్, ఉప్పరి శివకృష్ణ, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనుజ్ఞా రెడ్డి



**వనపర్తి,డిసెంబర్28(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి నియోజకవర్గ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వింగ్స్ క్రికెట్ క్లబ్ వనపర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సీజన్-6 ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఘనంగా జరిగింది.ఈ ఫైనల్ మ్యాచ్‌కు వనపర్తి నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనుజ్ఞా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆటగాళ్లను ఉత్సాహపరిచారు.గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించిన ఆమె, క్రీడలు యువతలో క్రమశిక్షణతో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మ్యాచ్‌ను ఆసక్తిగా వీక్షించారు.

# విశ్వబ్రాహ్మణ మార్కండేయ పద్మశాలి సంఘాల 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



◆ **ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ ప్రభుదాస్**

**నాచారం, డిసెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రనగర్ కాలనీ ఫేజ్-2 వెల్ఫేర్ అసోసియేషన్, నాగ పోచమ్మ దేవాలయం, కాప్రా సర్కిల్ విశ్వబ్రాహ్మణ సంఘం మరియు మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధికి సంబంధించిన ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే, కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, నాయకులు మునిగంటి రాంప్రదీప్, వంజరి ప్రవీణ్ కరిపే, నవీన్ గౌడ్, నగేష్, పుల్లూరు సత్తయ్య, కె. పరశురామ్, ఆర్. రాజారెడ్డి, కాలనీ అధ్యక్షులు సతీష్ రెడ్డి, సెక్రటరీ హరిప్రసాద్, అలాగే రంగారెడ్డి, జనార్ధన్, లక్ష్మి, శోభ గౌడ్, విజయ రెడ్డి, జగన్, విష్ణు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ఆది శంకర్, రవికుమార్, ప్రసాద్, పూసల బ్రహ్మచారి, కేశవరం ఆంజనేయులు చారి, పొలాస రమేష్, నూతలపాటి మల్లికార్జున చారి, సమ్మని మురళి చారి, కేతోజు శ్రీనివాస చారి, సత్యనారాయణ చారి, ప్రభాకర్ చారి, వడిచర్ల గోపాల్, మాకం అంజయ్య, అముల శ్రీహరి, సూర్యప్రకాష్, గుర్రం సతీష్ కుమార్, మామిడాల శ్రీపతి, కొంపల్లి మోహన్ రెడ్డి, బేతి పాండు, దుడుక లక్ష్మీనారాయణ, గంజి విజయ్ కుమార్, తదితర సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# చిన్నారుల పార్క్, ఓపెన్ జిమ్ ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా, డిసెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ వంపుగూడ డివిజన్ పరిధిలో బ్యాంక్ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన చిన్నారుల పార్క్ మరియు ఓపెన్ జిమ్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్నారుల శారీరక-మానసిక వికాసానికి, యువత మరియు పెద్దల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి వ్యాయామ, వినోద సదుపాయాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. నివాస ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.కాలనీ స్థాయిలో ఫిట్‌నెస్, వినోద సదుపాయాలు అందుబాటు లో ఉంటే ఆరోగ్యకర జీవనశైలి అలవడుతుందని, కుటుంబాలకు అనుకూలమైన సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బైరె నవీన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు పాల్గొన్నారు.కాలనీ అసోసియేషన్ సభ్యులు లచ్చయ్య, విజయ్ కరణ్, భరత్ వ్యాస్, రామోహం రావు, రామమూర్తి, ప్రేమనాథ్, రాజారావు, శివరామ కృష్ణలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నాళ్లుగానో ఉన్న అవసరాన్ని తీర్చినందుకు వారు ఆనందం వ్యక్తం చేశారు.అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంద్రయ్య, గిల్బర్ట్, మహేష్, మల్లారెడ్డి, కొండల్ గౌడ్, ఉప్కమల శ్రీనివాస్, పిల్లి సాయిరాం, కృష్ణ, శివ, గౌస్, గణేష్ తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజల హాజరుతో కార్యక్రమం ఘనవిజయంగా ముగిసింది. కాలనీలో ఆనందోత్సాహ వాతావరణం నెలకొంది.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- **జెండా ఆవిష్కరించిన ఎల్కతుర్తి మండల అధ్యక్షులు ఇంద్రసేన రెడ్డి**

**ఎల్కతుర్తి, డిసెంబర్ 28 : (తెలంగాణ ముచ్చట్లు):** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎల్కతుర్తి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇంద్రసేన రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ---


దేశ స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి ఆధునిక భారత నిర్మాణం వరకు కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. విద్య, వైద్యం, పేదల సంక్షేమం, సామాజిక న్యాయం వంటి రంగాల్లో కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన విధానాలు దేశాభివృద్ధికి బలమైన పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు.



స్వాతంత్ర్యం అనంతరం దేశంలో ఉన్నత విద్యా సంస్థలు, ఐఐటీలు, ఎయిమ్స్ వంటి ప్రముఖ వైద్య సంస్థల ఏర్పాటు ద్వారా లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ దూరదృష్టి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులకు మేలు చేసే విధానాలు, పేదలకు ఇళ్ల పథకాలు, మహిళలకు ఆర్థిక భద్రత కల్పించే కార్యక్రమాలు, విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అనే సిద్ధాంతాలతో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలిచిందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుఖినే సంతాజీ, మాజీ సింగిల్ విండో చైర్మన్ గోలి రాజేశ్వరరావు, బావుపేట సర్పంచ్ బత్తిని రవీందర్, దండపల్లి సర్పంచ్ సంపత్, మాజీ సర్పంచ్ గోడిశాల యాదగిరి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ బక్కి, యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా మాజీ జనరల్ సెక్రెటరీ మంద సుమన్ గౌడ్, బావుపేట గ్రామ అధ్యక్షులు లింగమూర్తి, మార్కెట్ డైరెక్టర్ బాబురావు, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబాల కుమారస్వామి, పాక రమేష్, డాక్టర్ రమేష్ బాబు, రంజిత్ రెడ్డి, సుమన్, బీమ్ రాజ్, నితిన్, ప్రదీప్, యాదగిరి రాజు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# కృష్ణశిల రాతితో శ్రీ చిలుకశ్వేర అంజనేయు స్వామి ఆలయ పునర్నిర్మాణం

రూ.1.90 కోట్లతో ప్రధాన ఆలయాలు, గోపుర—శిఖరాల నిర్మాణానికి ఒప్పందం

**ఉప్పల్, డిసెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** హరిహర క్షేత్రం శ్రీ చిలుకశ్వేర అంజనేయు స్వామి దేవాలయం, గాయత్రి మాత దేవాలయం మరియు ఉప ఆలయాల సముదాయం పునర్నిర్మాణ కార్యక్రమంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆలయ ప్రధాన ఆలయమైన శివాలయం తో పాటు గణేష్ ఆలయం, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలను పూర్తిగా కృష్ణశిల రాతితో నిర్మించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది.

ఈ మేరకు 18112025 నాడు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, స్థపతి సంజయ్ సమక్షంలో కాంట్రాక్టర్ సురేష్ కు నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. ప్రధాన ఆలయం శివాలయం, రెండు ఉప ఆలయాలు, గోపురం, శిఖరం సహా సంపూర్ణ ఆలయ నిర్మాణాన్ని కృష్ణశిల రాతితో పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ నిర్మాణ పనుల మొత్తం వ్యయం రూ.1,90,00,000/ (ఒక కోటి తొంబై లక్షలు)గా నిర్ణయించగా, అందులో భాగంగా కాంట్రాక్టర్‌కు రూ.10 లక్షలు అడ్వాన్స్ చెల్లించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ బూరుగుల రమేష్ గౌడ్, కోశాధికారి అమృత్ రావు, ముఖ్య సలహాదారులు శంభు ప్రసాద్, గోనె అంజయ్య ముదిరాజ్, వై. సుబ్బారావు, ఉప కోశాధికారి ఆడెపు అంజయ్య తదితరులు పాల్గొన్నారు

అలాగే ఉపాధ్యక్షులు చాతరాసి సిద్ధిరాజు, రామచర్ల బాలరామ్, మాస శేఖర్, గోపాల్ రెడ్డి, కార్యదర్శులు కొంగరి రామచందర్, కావలి నర్సింహం, గూడ శ్రీశైలం, గుర్రాల మల్లేష్, వైద్యుల వీరారెడ్డి, కొంపల్లి రవీందర్, సీకూరి కృష్ణ ముదిరాజ్ పాల్గొన్నారు. ఆలయ పూజారి ఉదయ్ శర్మతో పాటు కమిటీ సభ్యులు పైడిపాల గౌరయ్య, దండు అంజయ్య, ఎర్ర యాదగిరి, దేవుల పురుషోత్తం, మడిపడిగే శ్రీనివాస్, ఇంద్రరాల రమేష్, జమ్మల భాస్కర్ రెడ్డి, ఉమేష్ సింగ్, దివిటి రామరాజు, బి. వెంకటేష్ యాదవ్, శ్రీకాంత్ చారి, తాటి రాజు, శ్రీనివాస్ చారి, రామకృష్ణ గౌడ్ తదితరులు హాజరయ్యారు. కృష్ణశిల రాతితో ఆలయాల నిర్మాణం చేపట్టడం ద్వారా ఆలయానికి మరింత శిల్పకళా వైభవం చేకూరుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

# గాంధీభవన్‌లో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



- **రాష్ట్ర నాయకులతో దేవన్న యాదవ్ మర్యాదపూర్వక భేటీ**


**వనపర్తి,డిసెంబర్28(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ గాంధీభవన్‌లో 141వ జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన యాదవ్, పి. రాములు, పి. యాదగిరి, క్యామ బాలరాజ్ పాల్గొన్నారు.వేడుకల అనంతరం వారు రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షుడు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ని, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చరిత్ర, పార్టీ సిద్ధాంతాలు, ప్రజాసేవలో కాంగ్రెస్ పాత్రపై చర్చించినట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ దేశ స్వాతంత్ర్య సాధన నుంచి నేటి వరకు ప్రజల పక్షాన నిలబడుతూ సేవలందిస్తోందని, భవిష్యత్తులోనూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కృషి చేస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

# కీసర పోలీస్ స్టేషన్‌లో యువతకు సైబర్ నేరాలపై అవగాహన



**కీసర, డిసెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ కీసర సర్కిల్-1 డివిజన్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించే దిశగా కీసర పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ అంజనేయులు, ఎస్ఐలు లక్ష్మణ్, నాగరాజు మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 'స్కామ్ సే బచో' అంశంపై వివరాలు తెలియజేస్తూ, ఫేక్ కాల్స్, ఆన్‌లైన్ లావాదేవీలు, ఓటీపీ షేరింగ్ వంటి అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.సైబర్ నేరాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీఐ అంజనేయులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువత సైబర్ భద్రత ప్రతిజ్ఞ చేశారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి భారీ చేరికలు



**కుషాయిగూడ , డిసెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి భారీ చేరికలు చోటుచేసుకున్నాయి. తెలంగాణ రాజ్యాధికార పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు పానగట్ల చక్రపాణి గౌడ్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కుషాయిగూడ, ఏఎస్ రావు నగర్ డివిజన్లకు చెందిన వివిధ పార్టీల నాయకులు టీఆర్పీలో చేరారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరిశంకర్ గౌడ్ సమక్షంలో కొత్తగా చేరిన నాయకులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రతి కార్యకర్త భాగస్వామిగా మారి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రజాసమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన లక్ష్యమని, యువతతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడం ఆనందకరమని ఆయన అన్నారు.యువ నాయకులు సింగం అరుణ్, మహిళా నాయకురాలు షాలిని ఆధ్వర్యంలో ఎం. భాను ప్రకాష్, ఎల్. సురేందర్, ఎ. కిరణ్, దేవేందర్, శ్రీకాంత్‌లతో పాటు మహిళా నాయకురాళ్లు పి. అనిత, సౌందర్య, వనజ, హరిత, మంజుల, రేణుక తదితరులు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. పలువురు యువ నాయకులు కూడా పార్టీలో చేరి తమ మద్దతును ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నర్సయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయన అశోక్ ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి భావన వెంకటేష్, యువజన విభాగం అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కాకుల సంజీవ్‌తో పాటు టీఆర్పీ నాయకులు మచ్చ పాండు గౌడ్, బయ్య వెంకటేశ్వర్లు యాదవ్, పాకాల నర్సింహ్మా, మురళీ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
సోమవారం - 29 - డిసెంబర్ 2025



# ఎంపీజే ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ పై అవగాహన సదస్సు



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక 42వ డివిజన్ లోని రాతి దర్వాజా ప్రాంతంలో గల మోమీనాన్ మసీదు ఎదురుగా ఎం పి జే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్ ఐ ఆర్ ( ప్రత్యేక ఓటరు సవరణ ) పై అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సుకు 42 వ డివిజన్ ప్రజలు హాజరై పలు ప్రశ్నలు వేసి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సదస్సు నిర్వాహకులు , ఎంపీజే నాయకులు జవాబులు ఇచ్చారు. ఎస్ఐ ఆర్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షులు , జిల్లా అధ్యక్షులు షేక్ . ఖాసీమ్ , కోశాధికారి యం డి. హకీమ్, జిల్లా నాయకులు యం డి. గౌస్ జానీ , ఇస్మాయిల్ , రఫిక్ , ఆలీమ్ , అహమద్ , శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులను ముదిరాజ్ యువకులు ఘన సన్మానం



**పెద్దమందడి,డిసెంబర్28(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి గ్రామంలో ఇటీవల నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ముదిరాజ్ కులం తరపున విజయం సాధించిన ప్రజాప్రతినిధులను ముదిరాజ్ కుల సంఘం యువకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ ఎన్నికల్లో 8వ వార్డు నుంచి జంగం పద్మ శివ, 9వ వార్డు నుంచి వాకిటి రమేష్, 10వ వార్డు నుంచి గొడుగు జ్యోతి రాజశేఖర్, 11వ వార్డు నుంచి కొత్త స్వాతి రాములు వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. అలాగే గ్రామ సర్పంచ్‌గా సూర్య గంగమ్మ రవి, ఉపసర్పంచ్‌గా బోయిని ఉషన్న యాదవ్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ముదిరాజ్ కుల సంఘం యువకులు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఘన స్వాగతం పలుకుతూ, భవిష్యత్తులో ప్రజాసేవలో అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. వారి విజయంలో పాత్ర పోషించిన ప్రతి ఒక్కరికీ కుల సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు.ప్రభుత్వపరంగా అందుబాటులో ఉన్న అన్ని సంక్షేమ పథకాలను కుల, మత, మన అనే భేదం లేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందజేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యువ నాయకుడు అడ్వకేట్ నందిమల్ల త్రినాథ్ ముదిరాజ్, వాకిటి వేణుగోపాల్, మాజీ జెడ్పిటిసి నందిమల్ల వేణుగోపాలకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ గొడుగు రామచంద్ర, వాకిటి నాగభూషణం, పద్మనాభం, వైభవ్ శీను, నందిమల్ల బాలరాజు (మాజీ వార్డు సభ్యులు), రిటైర్డ్ హెడ్మాస్టర్ నందిమల్ల కృష్ణయ్య, నందిమల్ల కురుమూర్తి, వాకిటి సత్యనారాయణ, వీరమని కృష్ణయ్య తదితర కుల పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాంపల్లి రెడ్డి సంఘం నూతన కమిటీ ఎన్నిక



- **అధ్యక్షుడిగా ఏనుగు రామకృష్ణారెడ్డి ఎంపిక**

**నాగారం, డిసెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గం జీహెచ్ఎంసీ ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి రెడ్డి సంఘం నూతన కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా ఏనుగు రామకృష్ణారెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులు గా కొండేటి రామ్ రెడ్డి, ఏనుగు మునేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొలను బల్వంత్ రెడ్డి, సహాయక కార్యదర్శులుగా బట్టు ప్రభాకర్ రెడ్డి, లక్కిరెడ్డి భాస్కర్ రెడ్డి, కోశాధికారిగా తిరుపతి రెడ్డిని నియమించారు. కార్యవర్గ సభ్యులుగా పైల నరసింహారెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, కొండేటి రాజశేఖర్ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, కొండేటి లక్ష్మారెడ్డి, గీత ప్రవీణ్ రెడ్డి, బెజ్జంకి అనిల్ కుమార్ రెడ్డిలు ఎన్నికయ్యారు. సభ్యులు, సలహాదారులుగా బొమ్మిడి రాజారెడ్డి, పరిగె సత్తిరెడ్డి, బొంగురాల శంకర్ రెడ్డి, ఏనుగు రాజిరెడ్డి, బొంగరాల సుదర్శన్ రెడ్డి, నక్కిరెడ్డి శంకర్ రెడ్డి, కొండేటి ఎల్లారెడ్డి, కొండేటి నరసింహారెడ్డి, బొంగరాల నవీన్ రెడ్డిలను ఎంపిక చేశారు. అడ్వైజర్‌గా బొంగురాల శ్రీరామ్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఏనుగు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, కమిటీ సభ్యులు మరియు రెడ్డి సంఘం సభ్యుల సహకారంతో రాంపల్లి రెడ్డి సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సంఘం ఐక్యతతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.





# జాతీయ అవగాహన సదస్సులో యువత సేవా ఉద్యమంలో భాగస్వాములు కావాలి

## శ్రీరామ్ వెంకటేష్

**నాచారం, డిసెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సామాజిక నాయకుడు శ్రీరామ్ వెంకటేష్ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా సామాజిక సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.న్యూఢిల్లీలోని కన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో "దేశ నిర్మాణంలో సామూహిక బాధ్యత" అనే అంశంపై నిర్వహించిన జాతీయ అవగాహన సదస్సులో శ్రీరామ్ వెంకటేష్ ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, పోషణ, ప్రకృతి పరిరక్షణ, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి వంటి కీలక రంగాలను ప్రజల జీవితాలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా సమన్వయంతో కార్యక్రమాలు.కొనసాగుతున్నా యన్నారు. సామాజిక సేవల ద్వారానే సమాజంలో స్థిరమైన మార్పు సాధ్యమవుతుందని, సేవా భావనతో కూడిన నాయకత్వమే దేశాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక అవగాహన కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, యువత కలిసి ముందుకు తీసుకెళ్లినప్పుడే దీర్ఘకాలిక ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు.ప్రత్యేకంగా యువత, మహిళలు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ సేవా ఉద్యమంలో చురుకుగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సేవ అనేది మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపించాలన్నదే జాతీయ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పౌరులు చట్టాలను పాటించడం, నైతిక విలువలను నిలబెట్టడం, సహజ వనరులను పరిరక్షించడం వంటి అంశాల్లో ముందుండాలని సూచించారు.ఈ సదస్సులో విశిష్ట అతిథిగా పద్మశ్రీ డాక్టర్ రామ్ చంద్ర సిహాగ్ (హనీ బీ మ్యాన్ ఆఫ్ ఇండియా), ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా పీజేఆర్ 18వ వర్ధంతి వేడుకలు

- **పాల్గొన్న రాష్ట్ర కార్మిక విభాగ ఆర్గనైజింగ్ సెక్రటరీ దయ్యాల దాసు**




**వనపర్తి,డిసెంబర్28(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాటూరి రమేష్ ఆధ్వర్యంలో పీజేఆర్ 18వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లాకు చెందిన రాష్ట్ర కార్మిక విభాగ ఆర్గనైజింగ్ సెక్రటరీ దయ్యాల దాసుతో పాటు జిల్లాకు చెందిన నాయకులు పాల్గొన్నారు. అనంతరం జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాటూరి రమేష్ మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పీజేఆర్ అని, పేదల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

పీజేఆర్ ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, సామాన్యుల గుండెల్లో నిలిచిన నాయకుడిగా గుర్తుండిపోతారని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొంటూ, కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమం కోసం ఎప్పటికీ అంకితభావంతో పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దయ్యాల దాసు, భవాని రమేష్, గద్దల ప్రభాకర్, బోదాస్ నాగార్జున, గౌస్ బాయ్ సాయిలు, సత్యనారాయణ, బాల స్వామి, డి. రమేష్, నారాయణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో నివాళి అర్పించిన జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,డిసెంబర్28(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ గాంధీభవన్‌లో దివంగత ప్రజానేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిజిఆర్ గారి 18వ వర్ధంతిని పురస్కరించుకొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పిజిఆర్ చిత్రపటానికి రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి , వారి తనయుడు ఏఐపిసి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి పూలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో ఏఐపిసి సీఏ స్టేట్ హెడ్ సుబ్బారావు హ్యాండ్ వారియర్స్, కాంగ్రెస్ పార్టీ సభ్యులు తదితరులు పాల్గొని పిజిఆర్ సేవలను స్మరించుకున్నారు. పిజిఆర్ ప్రజా సేవలో చూపిన నిబద్ధత, కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు.



# పెద్దమందడిలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం


## పార్టీ జెండాను ఆవిష్కరించిన గ్రామ అధ్యక్షులు శ్రీనాథ్ (అడ్వకేట్)



**వనపర్తి 28 డిసెంబర్ 2025 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు త్రినాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ..దేశ స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి ప్రజాస్వామ్య పరిరక్షణ వరకు కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. పేదలు, రైతులు, కార్మికులు, అణగారిన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు.భారత రాజ్యాంగాన్ని కాపాడుతూ, ప్రజల హక్కుల కోసం ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ జెండాలు చేతబూని నినాదాలు చేశారు. అనంతరం స్వీట్లు పంచి ఆవిర్భావ దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు.

# వేములపల్లిలో పింఛన్ పంపిణీ..

## ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సర్పంచ్ అనిత



**వేలేరు 28 డిసెంబర్ 2025 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామ పరిధిలోని ఆమ్లెట్ గ్రామం వేములపల్లికి చెందిన వృద్ధులు, వికలాంగులు, ఒంటరి వితంతులు ప్రతి నెలా పింఛన్ డబ్బుల కోసం పీచర వరకు రావాల్సి ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పీచర గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన మరిజే అనిత - నరసింహారావు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల ఒకరోజు వేములపల్లికి వచ్చి వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్ పంపిణీ చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

ఆ హామీని నిలబెట్టుకుంటూ ఈరోజు (ఆదివారం) వేములపల్లిలో పోస్ట్‌మాస్టర్ ద్వారా పింఛన్ దారులకు పింఛన్ పంపిణీ నిర్వహించారు. దీంతో ఇకపై పింఛన్ కోసం దూర ప్రయాణాలు చేయాల్సిన అవసరం లేకపోవడంతో వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సర్పంచ్ అనితకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుడికందుల ప్రశాంత్, మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండి. జానీ, గ్రామస్తులు, వృద్ధులు, పింఛన్ దారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## కీసర సర్కిల్‌కు నూతన డిప్యూటీ కమిషనర్‌గా వసంత బాధ్యతలు స్వీకరణ




**కీసర, డిసెంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గంలోని కీసర సర్కిల్‌కు నూతన డిప్యూటీ కమిషనర్ గా వసంత శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంబంధిత ఉన్నతాధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.బాధ్యతలు చేపట్టిన అనంతరం డీసీ వసంత మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండే పారదర్శక పాలన అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ప్రతి సమస్యపై సత్వర స్పందనతో పని చేస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పరిపాలన సాగిస్తామని ఆమె తెలిపారు. కీసర సర్కిల్‌ను శాంతియుతంగా, సురక్షితంగా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగంతో పాటు ప్రజల సహకారంతో సమిష్టిగా కృషి చేస్తామని వసంత స్పష్టం చేశారు

# కళాశాలలు, పరీక్షలు ఉన్నా... ఉన్నత విద్యాభ్యాసనం ఎక్కడ..!

తెలంగాణలో ఉన్నత విద్యా వ్యవస్థ మౌనంగా క్షీణిస్తోంది. బయటకు కళాశాలలు నడుస్తున్నట్టే కనిపిస్తున్నా, లోపల విద్య అనే ఆత్మ నెమ్మదిగా నశిస్తోంది. తరగతులు ఉన్నా బోధన లేదు, అరకొర అధ్యాపకులు ఉన్నా మార్గనిర్దేశం లేదు, విద్యార్థులు ఉన్నా నిజమైన అభ్యసనం కనిపించడం లేదు. 'పుస్తకాలు' ఉండాల్సిన చేతుల్లో 'సెల్‌ఫోన్లు' కనిపిస్తున్నా, కళాశాలలకు వెళ్లకపోయినా తల్లిదండ్రుల నుంచి వ్యవస్థ వరకు ఎవరికీ పట్టడం లేదు. తరగతులు జరగకపోయినా వ్యవస్థ స్పందించకపోవడం ఈ మౌన నిర్లక్ష్యాన్ని మరింత పెంచుతోంది. ఫలితంగా విద్యాసంవత్సరం మొత్తం సమర్థవంతమైన అభ్యసనం లేకుండానే విద్యార్థులు పరీక్షలకు నామమాత్రంగా హాజరవుతున్నారు. సరైన ప్రత్యామ్నాయాలు లేకపోవడంతో చూచిరాతలు, మాస్ కాపీయింగ్, ఇతర అక్రమ మార్గాల వైపు తోసుకుపోతున్నారు. తరగతులు, అధ్యాపకులు, ప్రయోగశాలలు,జ్ఞానం, క్రమశిక్షణ, మేధో వికాసం వంటి మూల స్తంభాలు కూలిపోతూ ఉన్నత విద్య కేవలం 'పట్టా పొందే యాంత్రిక ప్రక్రియ'గా మారుతోంది. విద్య అనే ఆయుధం ఇవ్వాల్సిన వ్యవస్థ, ఖాళీ చేతులతోనే విద్యార్థులను పోటీ ప్రపంచంలోకి తోసేస్తోంది. ఈ దిగజారుదల ఒక్క కళాశాలకో విభాగానికో పరిమితం కాకుండా, ఇంజనీరింగ్ నుంచి డిగ్రీ, నర్సింగ్ నుంచి లా వరకు మొత్తం వ్యవస్థనే నిర్వీర్యం చేస్తోంది. ఎవ్వరూ ప్రత్యక్షంగా బాధ్యత వహించని ఈ వ్యవస్థే పరోక్షంగా భ్రష్టుపడుతున్న తతంగం. ఇది విద్యా సమస్య మాత్రమే కాదు, ఒక తరం భవిష్యత్తును ప్రశ్నార్థకంగా నిలబెట్టే ప్రమాదకర సంకేతం. ఇంజనీరింగ్ నుంచి డిగ్రీ, పీజీ, నర్సింగ్, ఫార్మసీ, వత్తివిద్య, లా కళాశాలల వరకు రాష్ట్రంలో విద్యా దుస్థితి విస్తరించింది. అనేక ప్రైవేట్ కళాశాలలు వంటి నియంత్రణ సంస్థల నిబంధనలను తూతూ మంత్రంగా పాటిస్తూ,



పూర్తి స్థాయి అధ్యాపకుల నియామకాన్ని తప్పించుకుంటున్నాయి. విద్యార్థులు తరగతులకు రాకపోవడమే మంచిదన్న మౌన అంగీకారంతో, ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా కళాశాలల నిర్వహణ సాగుతోంది. తరగతులు లేకున్నా కళాశాలలు నడుస్తున్నాయి. అధ్యాపకులు లేకున్నా గుర్తింపులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ, విశ్వవిద్యాలయాల పర్యవేక్షణ లోపమే దీనికి ప్రధాన కారణం. అనుమతుల విషయంలో చూపే చురుకుదనం, క్షేత్రస్థాయి తనిఖీల్లో మాత్రం కనిపించడం లేదు. విద్యాసంవత్సరం మొత్తం తరగతులు జరుగుతున్నాయా, అధ్యాపకులు హాజరవుతున్నారా, విద్యార్థులు తరగతులకు వస్తున్నారా అన్న ప్రాథమిక అంశాలపైనా పర్యవేక్షణ లేదు.క్షేత్రస్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. విద్యా సంవత్సరం మొత్తం పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరగతులకు హాజరు కావడం లేదు. థియరీ పాఠాలు, ప్రయోగశాల అనుభవం లేకుండానే విద్యా సంవత్సరాలు గడుస్తున్నాయి. ఫలితంగా జ్ఞానం, వ్యక్తిత్వం, నైపుణ్యాలు అభివద్ధి చెందడం లేదు. దిశానిర్దేశం లేని చదువు పరీక్షలను చూచిరాతల వైపు నడిపిస్తూ, సెమిస్టర్, వార్షిక పరీక్షలకు తరగతుల్లో నేర్చుకున్న పరిజ్ఞానం లేకుండానే నామమాత్రంగా హాజరవుతున్నారు. ప్రత్యామ్నాయాలు లేకపోవడంతో చూచిరాతలు, మాస్ కాపీయింగ్, అక్రమ మార్గాలు సాధారణమవుతున్నాయి. ఇది విద్యార్థుల తప్పు మాత్రమే కాదు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, కొందరు అధ్యాపకులు కూడా ఈ అక్రమాలను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రోత్సహించడం ఆందోళన కలిగించే విషయం. ''పట్టా వస్తే చాలు'' అంటున్న తల్లిదండ్రులు, సమాజం మౌన ధోరణి ఈ దిగజారుదలకి బలం ఇస్తోంది. ఫలితంగా నైపుణ్యాలు, పరిశోధనా పరిజ్ఞానం లేని పట్టభద్రులు తయారవుతూ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది. తరగతులకు వెళ్లకుండానే నేరుగా పరీక్షలకు హాజరయ్యే వారి సంఖ్య పెరగడంతో, జ్ఞానాన్ని పరీక్షించాల్సిన పరీక్షలే 'జవాబులు చూసి రాయగలిగితే చాలు' అనే స్థాయికి దిగజారాయి. ఇందులో ఏమి కోల్పోతున్నామో విద్యార్థులు, కళాశాలలు, సమాజం మొత్తం గ్రహించలేని స్థితి నెలకొంది. నేటి రోజుల్లో విద్యార్థులు పుస్తకాలతో అనుబంధాన్ని కోల్పోయి, చదవాల్సిన చేతుల్లో గంటల తరబడి సెల్‌ఫోన్లే కనిపిస్తున్నాయి. విద్యకు ద్వారంగా మారాల్సిన సాంకేతికత, నేడు విద్యార్థులను విపరీత ధోరణుల వైపు నడిపించే సాధనంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. అవసరం లేని కంటెంట్‌లో విలువైన సమయాన్ని వథా చేయడం వల్ల చదువుపై ఆసక్తి తగ్గి, రెగ్యులర్‌గా కళాశాలలకు వెళ్లి తరగతులు వినాలన్న ఉత్సాహం క్రమంగా క్షీణిస్తోంది. ఫలితంగా ప్రత్యక్ష అభ్యసనం, అధ్యాపకుల మార్గనిర్దేశం ద్వారా పొందాల్సిన జ్ఞానం విద్యార్థుల జీవితాల నుంచి దూరమవుతోంది. ఈ నిర్లక్ష్యం కొందరిని మత్తు పదార్థాలు, డ్రగ్స్ వైపు నెట్టేస్తూ, చదువుకే కాదు జీవితానికే దారి తప్పే ప్రమాదాన్ని పెంచుతోంది. ఇది వ్యక్తిగత సమస్య కాదు, రాబోయే తరానికి సంబంధించిన సామాజిక సంక్షోభం. విద్యార్థులనే నిందించడం సరికాదు. ((తల్లిదండ్రులు, కళాశాలలు, ప్రభుత్వం, సమాజం కలిసి సెల్‌ఫోన్ వినియోగంపై నియంత్రణతో పాటు ప్రత్యక్ష విద్యకు ప్రాధాన్యం, క్రమశిక్షణతో కూడిన అకడమిక్ వాతావరణాన్ని తక్షణమే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.) స్కాలర్‌షిప్ ద్వారా ఫీజు రీయంబర్స్మెంట్‌ను ప్రభుత్వం ఏళ్ల తరబడి ఆలస్యం చేయడం మరో కీలక సమస్య. దీని వల్ల నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. అదే సమయంలో, ఈ ఆలస్యాలను సాకుగా చూపుతూ కళాశాలలు బోధన నాణ్యతను తగ్గించడం మరింత ఆందోళనకరం. ప్రభుత్వ నిర్లక్ష్యం, కళాశాలల బాధ్యతాహీనత మధ్య విద్యార్థుల భవిష్యత్తే నలిగిపోతోంది. కనీసం 75 శాతం హాజరు లేకుండా వార్షిక పరీక్షలకు మినహాయింపులు ఇవ్వకుండా, నిబంధనలను పరీక్ష ఫీజు, స్కాలర్‌షిప్‌ల కింద మెస్ ఛార్జీలు, ఫీజు రీయంబర్స్మెంట్ విడుదలతో అనుసంధానం చేయాలి. అదే సమయంలో ప్రభుత్వం విద్యార్థి సంక్షేమాన్ని కేంద్రంగా పెట్టుకుని ఆర్థిక ప్రోత్సాహకాలను నిర్దిష్ట కాలపరిమితిలో విడుదల చేయాల్సిన బాధ్యతను వహించాలి. లేకపోతే ఫీజు భారం నేరుగా తల్లిదండ్రులపై పడుతూ, నిరుపేద కుటుంబాలను కఠిన నిర్ణయాలకు నెట్టే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ కోణాన్ని విద్యా విధానాల్లో విస్మరించకూడదు.

# ప్రపంచానికి దిక్సూచి చైనా

సోవిట్ సోషలిస్ట్ నమూనా పతనం అనేది చైనా కమ్యూనిస్టు పార్టీ(సిపిసి)లో పెద్ద చర్చకు దారితీసింది. సిపిసి నాయకత్వం సోవియట్ మోడల్‌ని అనుసరించకుండా మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని, చైనాస్థానిక పరిస్థితులకు వర్తింపజేసే సోషలిస్టు నమూనాను ఎంచుకుంది. ''చైనా లక్షణాలతో కూడిన సోషలిజం'' అనే విధానాన్ని ఎంచుకుంది. అంటే మార్క్సిజం లెనినిజం సిద్ధాంతం వెలుగులో చైనా దేశీయ లక్షణాలతో కూడిన సోషలిజం నమూనాను అమలు చేయాలని సిపిసి నిర్ణయించు కుంది. భారతదేశానికి స్వాతంత్రం 1947 ఆగస్టు 15న వచ్చింది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా 1, అక్టోబర్ 1949లో ఏర్పడింది. మన స్వాతంత్రం తర్వాత రెండు సంవత్సరాల 35 రోజులకు చైనా ప్రజా రిపబ్లిక్ ఏర్పడింది. రెండు దేశాలకు అనేక పోలికలు ఉన్నాయి. కానీ చైనా అమెరికాను సవాలు చేస్తుంది. ప్రపంచ జీవన వ్యయ పోలిక (పిపిపి)ని అనుసరించి అమెరికాను చైనా అధిగమించింది. అనేక రంగాలలో అమెరికాను చైనా దాటిపోయింది. కానీ భారత్‌లో దారిద్ర్యం, ఆకలి, అన్నదాతల ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, కాలుష్యం, పౌష్టికాహార లోపం, వెనక బాటుతం, విద్యారంగ దుస్థితి, పెచ్చరిల్లుతున్న నేరాలు, అనేక అసమానతలు తాండవిస్తున్నాయి. చైనా అత్యున్నత నాయకుడు డెంగ్ సియావో పింగ్ 1978లో ప్రారంభించిన ''ఓపెనింగ్ అప్'' కీలకమైన సంస్కరణలు చైనా సమగ్ర స్వరూపాన్ని సమూలంగా మార్చి వేశాయి. చైనా 85 కోట్ల మంది ప్రజల దారిద్ర్యాన్ని రూపుమాపింది. వారి ఆర్థిక సమగ్ర జీవన పరిస్థితులని సమూలంగా మార్చింది. ఇది ప్రపంచ మానవ అభివద్ధిలో అసాధారణమైనది. 30 ఏండ్ల క్రితం ఆదేశ జనాభాలో 66శాతం ప్రజలు అత్యంత పేదరికంలో జీవించారు. అలాంటిది 2020 నాటికి చైనా ఆ దేశంలోని దారిద్ర్యాన్ని సంపూర్ణంగా నిర్మూలిం చింది. మొత్తం ప్రపంచ మానవాళి చరిత్రలో చైనా ప్రజల పేదరిక నిర్మూలన చారిత్రాత్మకమైన ఘట్టం. ఆశ్చర్యకరమైనదనీ ప్రపంచ ప్రముఖులు వర్ణిస్తున్నారు.అనేక దశాబ్దాలుగా ఆటోమొబైల్‌ను



ఏలిన అమెరికా పచ్చిమయూరప్ ఆటో ఇండిస్టీ చైనా పోటీకి బీటలు బారుతోంది. మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో..స్టీల్ ఉత్పత్తిలో 53.9శాతం, సిమెంట్ ఉత్పత్తిలో 51.1శాతం, ఫెర్టిలైజర్స్, కెమికల్స్ లో 20 30శాతం ఒక్క చైనాయే ఉత్పత్తి చేస్తున్నది. ప్రపంచంలోనీ హై స్పీడ్ రైల్ లైన్ మొత్తంలో ఒక్క చైనా 66శాతం కలిగి ఉంది. ప్రపంచ భారీ ఓడల నిర్మాణంలో చైనా ఒకటే 51శాతం నిర్మిస్తోంది. ప్రపంచ సముద్ర జలాల్లోకి వెళ్లే కొత్త భారీ ఓడల్లో సగం చైనా నిర్మించినవే. అవి కూడా ఏ దేశం నిర్మించనంత చౌకగా, నాణ్యంగా, గొప్ప సాంకేతికతతో చైనా నిర్మిస్తున్నది. రెండు దశాబ్దాల క్రితం ఓడల నిర్మాణంలో చిరునామాలేని చైనా దెబ్బకు అమెరికా పశ్చిమ యూరప్ షిప్ బిల్డింగ్ పరిశ్రమ కూలిపోగా, సౌత్ కొరియా జపాన్‌లు ఎదురీదుతున్నాయి. ఇండియా ఎక్కడో అడుగున ఉంది. సముద్ర జల రవాణాను వ్యూహాత్మకంగా విప్లవాత్మకంగా మార్చింది చైనా. అమెరికాను చైనా అనేక రంగాల్లో అధిగమించింది. మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో 30 శాతం కేవలం చైనాదే అంటే ఆ దేశ ప్రగతి ఎంత వేగంతో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఆధిపత్యంలేని, అందరికీ సమానమైన న్యాయమైన బహుళ ధ్రువ ప్రపంచ వ్యవస్థ నిర్మాణం కొరకు, మంచి మార్పుల కోసం ఒక ప్రభల శక్తిగా చైనా నిలబడింది. అమెరికా ఇంగ్లాండ్ పశ్చిమ యూరోప్, జపాన్ లాంటి ఆధిపత్య వలసవాదానికి పూర్తి వ్యతిరేకమైన ఒక బలమైన మదువైన శక్తిగా దక్షిణ ఆఫ్రికా ఖండ, దక్షిణ అమెరికా, ఆసియా, పశ్చిమ ఆసియా, సెంట్రల్ ఆసియా దేశాలతో కలిసి నిలబడింది. మానవీయ జీవన విలువల ప్రమాణాన్ని నిర్ణయించడం కోసం ప్రపంచంలో ఎక్కడా లేని ''సోషల్ క్రెడిట్ సిస్టం(ఎస్‌సిఎస్)'' ను చైనా నెలకొల్పింది. 700 మిలియన్ల ఫేషియల్ రికగ్నిషన్‌ను గుర్తించే శక్తివంతమైన కెమెరాలు దేశ ప్రజలతో పాటు, ఇతర దేశాల పర్యాటకులను పర్యవేక్షించి నియంత్రిస్తున్నాయి. చైనా తన ప్రజల్లో సామాజిక సామరస్యాన్ని నెలకొల్పుతున్నది. నేరాల రేటు గణనీయంగా పడిపోయింది. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచంలో సురక్షితమైన దేశంగా గత రెండు దశాబ్దాల్లో చైనా మొదటి శ్రేణిలో నిలుస్తున్నది. 1990లో చైనా 170 పట్టణాలను కలిగి ఉండేది. నేడు అవి 700లకు పెరిగాయి. 17 మెగా సిటీలున్నాయి. షేన్జెన్ అనే ఒక చిన్న చేపలు పట్టే పట్టణం నేడు ప్రపంచానికి సిలికాన్ వాలీగా మారింది. డెంగ్ సియాఓ పింగ్ 'ఓపెనింగ్ అప్' చేసిన నాలుగు దశాబ్దాలలోనే చైనాలో ప్రపంచ మానవాళిని సమ్మోహన పరిచేలా, కండ్లు మిరుమిట్లు గొలిపేలా, అద్భుతమైన అభివ□ద్ధి జరిగింది. వీటన్నింటికీ ఒక్కటే సమాధానం. చైనాను అన్ని రంగాలలో ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దాలనే ద□ఢమైన సంకల్పం గల విప్లవాత్మక నాయకత్వానికి ఆ కీర్తి దక్కుతుంది. డెంగ్ సియాఓ పింగ్ ''ఓపెనింగ్ అప్''తో, అమెరికా, పశ్చిమ, వివిధ దేశాల పెట్టుబడిదారులు చౌకైన శ్రమను కొల్లగొట్టడంకై తమ పరిశ్రమలన్నీ చైనాకు తరలించాయి. షరతు ప్రకారం కీలక సాంకేతికతలన్నీ చైనా గుప్పిట్లోకి వచ్చాయి. చైనా ప్రపంచ ఫ్యాక్టరీగా మారింది. ప్రపంచ ప్రజలు వినియోగించే 30శాతం పైగా వస్తువులు చైనా దేశానివే అంటే అతిశయోక్తి కాదు. చైనా విద్యుత్ వినియోగం చూస్తే కండ్లు తిరిగిపోతాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్, ఇండియా, రష్యా, జపాన్ అన్నీ కలిసి ఎంత వినియోగిస్తాయో అంతకంటే ఎక్కువ కరెంటును చైనా వినియోగిస్తుంది. చైనా హైడ్రో పవర్ దాని పరిశ్రమకు వెన్నెముకగా ఉంది. 436 గిగా వాట్ కెపాసిటీ ప్రపంచంలోనే అతి పెద్దదిగా ఉంది. త్రీ గార్జెస్ డ్యామ్ ఒకటే 22,500 మె.వా. కాలుష్య రహిత విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద, తన రికార్డును తానే తిరగరాస్తున్న చైనా త్రీ గార్జెస్ కంటే రెండింతల పెద్ద ''మెడోగ్ హైడ్రో పవర్ స్టేషన్'' (60 వేల మె.వా.)నిర్మాణం ప్రారంభించింది. ప్రక□తి హితమైన ''నూతన ఉత్పత్తి శక్తులను నిర్మించడమే చైనా ఏకైక లక్ష్యంగా ఉంది''. బొగ్గు విద్యుత్ వినియోగం ఇప్పటికీ గణనీయమైన 58శాతం అయినప్పటికీ, వేగంగా బొగ్గు ఆధారిత విద్యుత్తును తగ్గిస్తున్నది. న్యూక్లియర్ ఫ్యూజన్(కేంద్రక సంలీనం)తో సూర్యుడిలోని స్వచ్ఛమైన విద్యుత్తు ఉత్పత్తి ప్రక్రియను ఒక ఫ్యాక్టరీ రూపంలో చైనాలో నిర్మిస్తోంది. అది పూర్తయితే ప్రక□తికి హానిలేని అనంతమైన విద్యుత్తు అందుబాటులోకి వస్తుంది. ఇలా చైనా నూతన ఉత్పత్తి శక్తులను భారీ ఎత్తున అభివ□ద్ధి చేస్తోంది.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్తు అవసరాలకు సరిపడా విద్యుత్తును ఉత్పత్తి చేయడం చైనా లక్ష్యంగా పెట్టుకుంది. 2025కు 200 టెరావాట్ హవర్, 2030 కల్లా 600 టెరావాట్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలని చైనా లక్ష్యం. ఒక్క 2024 లోనే చైనా 429 గిగా వాట్ విద్యుత్తును కొత్తగా చైనా ఉత్పత్తి చేసింది. కానీ ఇదే సమయంలో అమెరికా 51 గిగా వాట్ విద్యుత్తును మాత్రమే ఉత్పత్తి చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఎఐ)డేటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లకు నిరంతర విద్యుత్తు భారీ ఎత్తున అవసరం. ఏఐ రేసులో అమెరికా కంటే అన్ని దేశాల కంటే ముందున్న చైనా, గెలుపు దిశగా వేగంగా అడుగులు వేస్తున్నది. 2024లో చైనా 9,852 టిడబ్ల్యూహెచ్ విద్యుత్తును వినియోగించింది. అంటే.. ఆసియా ఖండంలోని మొత్తం దేశాల విద్యుత్ డిమాండ్‌లో సగానికి పైగా ఒక్క చైనానే వినియోగించింది. 2025 చివరి నాటికి 10,498 టిడబ్ల్యూహెచ్‌కి చేరుకుంటుంది. సాంకేతిక రంగంలో అత్యున్నత స్థాయి ఇన్నోవేషన్ డెవలప్‌మెంట్ ప్రాతిపదికగా 2024లో చైనా ప్రభుత్వం పరిశోధనలకు 570 బిలియన్ డాలర్లు కేటాయించింది. సాఫ్ట్‌వేర్ నుండి హార్డ్‌వేర్‌తో రోబోట్ల ద్వారా అన్ని రంగాలలో మార్కెట్‌కు అనుగుణమైన బిజినెస్ మోడల్ తయారీ కొరకు కొత్త భాగస్వాములు, పెట్టుబడిదారులతో కూడిన ఉత్పత్తి కార్యకలాపాలను చైనా ప్రారంభించింది. ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో రెండువందల కంపెనీలు పనిచేస్తున్నాయి. ప్రపంచంలోనే పేరెన్నికగన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీలు చైనాలో ఐదు వేలు ఉన్నాయని ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది. చైనా అభివ□ద్ధి నమూనా అనేది ఇతర దేశాలకు గుడ్డిగా ఎగుమతి చేసే సార్వత్రిక నమూనా కాదని సిపిసి నాయకత్వం కుండబద్దలు కొట్టినట్టు చెపున్నది. ప్రతి దేశం తన దేశీయ (శీతోష్ణస్థితి, భౌగోళిక, సాంస్కతిక, జీవవైవిధ్య, వాతావరణ, చరిత్ర) అనేక పరిస్థితు లకు అనువైన వైవిధ్యపూరితమైన విధంగా నిర్ణయించుకోవాలని, గుడ్డిగా అనుసరించవద్దని సిపిసి పేర్కొంటున్నది. చైనా ప్రతియేటా ఏడు మిలియన్ల కాలేజీ గ్రాడ్యుయేట్లను ఉత్పత్తి చేస్తుంది. చైనాలో ఎస్‌టిఈఎం (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీ రింగ్, మ్యాథ్స్) విద్యార్థులు ప్రతియేటా ఐదు మిలియన్ల మంది బయటికి వస్తున్నారు. అమెరికాలో కేవలం ఎనిమిది లక్షల మంది ఎస్‌టిఈఎం విద్యార్థులు తమ విద్యను పూర్తి చేసుకుంటున్నారు. ఒక మిలియన్ విద్యార్థులు చైనా కమ్యూనిస్టు పార్టీలో చేరుతున్నారు. పార్టీ సభ్యుల ఎన్నిక ప్రక్రియ అత్యంత పోటీతో కూడుకుని ఉంటుంది. మార్క్సిజం పట్ల సైద్ధాంతిక నిబద్ధత, అత్యంత ప్రతిభ, కష్టపడి పని చేసే విలువలతో కూడిన మచ్చలేని వారిని సిపిసి ఎన్నుకుంటుంది. చైనా వ్యవసాయ పరిశ్రమలో ప్రపంచ ప్రమాణాలతో కూడిన ఆధునీకరణ (మోడ్రనైజేషన్) 2012లో 57 శాతం అయితే, 2021లో 72 శాతానికి చేరింది. ఎరువులు, పురుగు మందులు చల్లడం, ట్రాక్టర్లు దున్నడం, నాట్లు వేయడం మనుషులు లేకుండా స్వయం చాలిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అత్యాధునిక సాంకేతిక యంత్రాలతో జరుగుతున్నది. శిలాజ ఇంధనాలు లేని, స్వచ్ఛమైన బ్యాటరీ విద్యుత్తుతో నడిచే స్వయం చాలిత యంత్రాల ఉత్పత్తి ముమ్మరంగా జరుగుతుంది. డ్రైవర్ లేకుండా వరి నాటు పెట్టే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యంత్రం రోజుకు 17 ఎకరాలకు పైగా ఖచ్చితమైన కొలతతో నాటు వేస్తుంది. డ్రైవర్ లేకుండా ''బైదు సాటిలైట్''తో నడిచే ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు పూర్తి ఆటోమేటెడ్ (స్వయం చాలితమైన)వి సాధారణ ట్రాక్టర్ల కంటే 50శాతం అధిక సామర్థ్యం కలవి. నిపుణులైన మనుషుల కంటే కూడా దీని వ్యవసాయ పని నిర్వహణ కచ్చితత్వంతో కూడుకొని ఉంటుంది. చైనాలో నేడు ధాన్యం తలసరి ఉత్పత్తి అంతర్జాతీయ స్థాయిని దాటింది.

# ఈ ఏడాది భారత్‌కు గర్వకారణం

(మొదటి పేజీ తరువాయి)

పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని, మహిళల క్రికెట్ జట్టు తొలిసారి వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకొని క్రీడల పరంగా ఈ ఏడాదిని చిరస్మరణీయంగా మార్చాయని అన్నారు. అంతేకాకుండా, మహిళల అంధుల జట్టు టీ20 ప్రపంచ కప్‌ను సాధించి చరిత్ర సృష్టించిందని తెలిపారు. ఆసియా కప్ టీ20లో అద్భుతమైన విజయం సాధించిన తర్వాత త్రివర్ణ పతాకం గర్వంగా రెపరెపలాడిందని, పారా అథ్లెట్లు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతాకల పంట పండించారని మోదీ కొనియాడారు. సైన్స్, అంతరిక్ష రంగాల్లోనూ భారత్ గొప్ప ముందడుగు వేసిందని, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడిగా శుభాన్షు శుక్లా నిలిచారని పేర్కొన్నారు. ఈ ఏడాది దేశంలోని చిరుతపులుల సంఖ్య 30కి పైగా పెరిగిందని తెలిపారు.

ఈ సందర్భంగా 2025లో జరిగిన వివిధ కార్యక్రమాలను మోదీ ప్రస్తావించారు. మన సంస్కృతి, విశ్వాసాలకు ప్రతీకగా ఏడాది ప్రారంభంలో ప్రయాగరాజ్‌లో నిర్వహించిన మహా కుంభమేళా యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందని అన్నారు. అయోధ్య రామమందిరంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమం ప్రతి హిందువు గర్వపడేలా చేసిందన్నారు. ''2025 భారత్‌కు మరింత ఎక్కువ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. సరికొత్త ఆశలు, సంకల్పాలతో నూతన సంవత్సరం 2026లో ముందుకు సాగడానికి దేశం సిద్ధంగా ఉంది' అని మోదీ అన్నారు.

ప్రపంచం మొత్తం ఈ రోజు భారత్‌వైపు ఎంతో ఆశగా చూస్తోందని, దేశంలోని యువ శక్తే దీనికి అతిపెద్ద కారణమని మోదీ అభివర్ణించారు. జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవంతో పాటు 'యంగ్



లీడర్స్ డైలాగ్'ను నిర్వహిస్తామని, అందులో తాను కూడా తప్పనిసరిగా పాల్గొంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవిష్కరణలు, ఫిట్‌నెస్, స్టార్ట్‌పలు, వ్యవసాయం తదితర కీలక అంశాలపై యువత తమ ఆలోచనలు పంచుకుంటారని వెల్లడించారు. భారతీయ సంస్కృతి, భాషలను విశ్వవ్యాప్తం చేయడంలో భాగంగా కొత్త తరాన్ని తమిళ భాషతో అనుసంధానించడానికి ఫిజీలో జరుగుతున్న ప్రయత్నాలను ప్రశంసించారు. కాగా, యాంటీబయాటిక్స్ విచ్చలవిడి వాడకంపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి ఇష్టానుసారంగా తీసుకొనేవి కావని, డాక్టర్ సలహా మేరకే వాడాలని ప్రజలను కోరారు.

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వద్దనున్న సీతారాంపురం గ్రామం లేస్ పరిశ్రమకు కేరాఫ్‌గా నిలుస్తోంది. దాదాపు 160 ఏళ్ల క్రితం ఐర్లాండ్ దేశస్థులు వ్యాపారం నిమిత్తం ఈ ప్రాంతానికి వచ్చారు. ఇక్కడి మహిళలకు లేసు అల్లికలపై శిక్షణ ఇచ్చి, వారికి ఉపాధి కల్పించడంతో పాటు అల్లికలను విదేశాలకు ఎగుమతి చేశారు. ఇలా మొదలైన లేస్ పరిశ్రమ 2010కల్లా వేలాది మందికి ఉపాధి కల్పించడమే కాకుండా ఏటా రూ.150 కోట్ల ఎగుమతులు జరిగేవి. 2010లో ప్రభుత్వం నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలో లేస్ పార్కును ఏర్పాటుచేసి మహిళలకు అల్లికల్లో ఆధునిక శిక్షణ ఇవ్వడం ప్రారంభించింది. నరసాపురం లేస్‌కు జీఐ ట్యాగ్ లభించడం మరింత గుర్తింపునిచ్చింది. ఈ నేపథ్యంలోనే నరసాపురం లేస్ క్రాఫ్ట్ మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తోందని మోదీ ప్రశంసించారు.

దుబాయ్‌లో కన్నడ పాఠశాల ఏర్పాటు పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసలు అందజేశారు. ప్రవాస కన్నడిగుల కోసం కన్నడ పాఠశాల కొనసాగించడం సంతోషకరమన్నారు. ఆదివారం 'మన్ కీ బాత్'లో భాగంగా కన్నడిగుల భాషాభిమానాన్ని ప్రధాని కొనియాడారు. దుబాయ్‌లో నివసించే కన్నడిగులు కన్నడ భాషను మరువరాదని ఓ ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేశారని, పిల్లలకు కన్నడ రాయడం, చదవడం, మాట్లాడడం నేర్పుతున్నారని,. సుమారు వెయ్యిమంది పిల్లలకు కన్నడ భాష నేర్పించే ప్రక్రియ జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.



## దక్షిణ మధ్య రైల్వేకు 19,314 కోట్ల ఆదాయం

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

దక్షిణ మధ్య రైల్వే ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు రికార్డు స్థాయిలో రూ.19,314 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. గత ఏడాది ఇదేకాలంలో వచ్చిన ఆదాయం (రూ.18,831 కోట్లు)కన్నా ఇది రూ.483 కోట్లు ఎక్కువ. ఈసారి ప్రధానంగా 136.2 మిలియన్ టన్నుల సరకు రవాణాతో రూ.12,841 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రయాణికుల నుంచి చార్జీల ద్వారా రూ.5,525 కోట్ల ఆదాయం వచ్చినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లలో రైళ్ల రద్దీ తగ్గించేందుకు ఈఏడాది చర్లపల్లిలో నూతన శాటిలైట్ టెర్మినల్‌ను అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వే స్టేషన్లను అమృత్ స్టేషన్లుగా పునరాభివృద్ధి చేసినట్టు తెలిపారు. రూ.2.2 కోట్ల వ్యయంతో కాచిగూడ హెరిటేజ్ స్టేషన్‌ను ఇండోగోథిక్ శైలిలో పునరుద్ధరించినట్టు పేర్కొన్నారు. సంజామల, యేర్పేడు, జనపహాడ్‌ల వద్ద కార్గో గతి శక్తి టెర్మినల్‌స్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. 68 ప్రాంతాల్లో మ్యాన్డ్ లెవల్ క్రాసింగ్ గేట్లను తొలగించి 22 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, 60 రోడ్ అండర్ బ్రిడ్జిలు నిర్మించినట్టు వివరించారు. ఈ ఏడాది కొత్తగా 199 కిలోమీటర్ల ట్రాక్‌ను అభివృద్ధి చేయగా.. ఇందులో 144 కిలోమీటర్లు మూడో లైన్, 40 కిలోమీటర్ల డబుల్ లైన్ ఉన్నాయి. వంద శాతం విద్యుదీకరణ పూర్తవడంతో సికింద్రాబాద్ డివిజన్ ప్రత్యేక ఘనతను పొందింది.

సంక్రాంతికి మరో 11 ప్రత్యేక రైళ్లు...

సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని మరిన్ని ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. జనవరి 7 నుంచి 12 వరకు హైదరాబాద్ నుంచి/మీదుగా మొత్తం 11 ప్రత్యేక రైళ్లు ప్రయాణీకులకు అందుబాటులో ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. జనవరి 7, 8, 9 తేదీల్లో కాకినాడ నుంచి వికారాబాద్‌కు మూడు, 8న సికింద్రాబాద్‌పార్వతీపురం మార్గంలో ఒకటి, 9న పార్వతీపురం నుంచి సికింద్రాబాద్‌కు ఒకటి, 9, 10 తేదీల్లో వికారాబాద్ నుంచి పార్వతీపురంకు రెండు, 10న పార్వతీపురం నుంచి వికారాబాద్‌కు ఒకటి, 12న పార్వతీపురంకాకినాడ మధ్య ఒకటి, 8, 10 తేదీల్లో వికారాబాద్‌కాకినాడ మార్గంలో 2 ప్రత్యేకరైళ్లను నడపనున్నట్లు సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లకు అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్ బుకింగ్ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

## ఖర్జూరాలు.. వంధ్యత్వానికి చెక్!

చలికాలంలో ఖర్జూరాలు రోగనిరోధక శక్తిని పెంచి, శరీరానికి వెచ్చదనాన్ని అందిస్తాయి. నెయ్యిలో వేయించిన లేదా కాల్చిన ఖర్జూరాలతో అద్భుతమైన ఆరోగ్య లాభాలు ఉన్నాయి. రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని పాలతో తీసుకోవడం ఉత్తమం. వీటిని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల పురుషులు, మహిళలకు కలిగే ప్రయోజనాలు. చలికాలం వచ్చిందంటే చాలు.. వాతావరణంలో మార్పుల వల్ల మన రోగనిరోధక శక్తి తగ్గుతుంటుంది. అందుకే ఈ సీజన్‌లో ఆహారం విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చలికాలంలో శరీరానికి వెచ్చదనాన్ని, శక్తిని ఇచ్చే డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం ఎంతో మేలు. వీటిలో ఖర్జూరాలు అత్యంత కీలకమైనవి. అయితే



ఖర్జూరాలను సాధారణంగా తినడం కంటే నెయ్యిలో లేదా నేరుగా వేయించి తినడం వల్ల రెట్టింపు ప్రయోజనాలు ఉంటాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఢిల్లీకి చెందిన ప్రముఖ ఆయుర్వేద నిపుణుడు డాక్టర్ చంచల్ శర్మ అభిప్రాయం ప్రకారం.. కాల్చిన ఖర్జూరాలు శరీర ఉష్ణోగ్రతను సమతుల్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఖర్జూరాల్లో ఉండే ఐరన్, ఖనిజాలు మహిళల్లో హార్మోన్ల స్థాయిలను నియంత్రిస్తాయి. ఇవి మహిళల్లో అండోత్సర్గము పక్రియ సజావుగా సాగడానికి తోడ్పడతాయి, తద్వారా గర్భధారణ అవకాశాలు మెరుగుపడతాయి. పురుషుల్లో సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో కాల్చిన ఖర్జూరాలు అద్భుతంగా పనిచేస్తాయి. ఇవి స్పెర్మ్ నాణ్యతను పెంచి వంధ్యత్వ సమస్యలను దూరం చేస్తాయి. శరీరం రాత్రిపూట తనను తాను మరమ్మతు చేసుకుంటుంది. కాబట్టి రాత్రి పడుకునే ముందు కాల్చిన ఖర్జూరాలను తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. ఖర్జూరాలను దోరగా వేయించి, గోరువెచ్చని పాలతో కలిపి తీసుకుంటే పూర్తిస్థాయి పోషకాలు అందుతాయి.ఖర్జూరాలు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ, అందరికీ సెట్ కాకపోవచ్చు. డాక్టర్ చంచల్ శర్మ హెచ్చరిక ప్రకారం.. ఈ క్రింది సమస్యలు ఉన్నవారు వీటిని తినకపోవడమే మంచిది..

షుగర్ లెవల్స్ అదుపులో లేని వారు ఖర్జూరాలకు దూరంగా ఉండాలి. లివర్ వ్యాధులు ఉన్నవారు వైద్యుని సలహా మేరకే తీసుకోవాలి.

## మొలకెత్తిన ఉల్లిపాయలు తినొచ్చా?




దాదాపు ప్రతి ఇంటి వంటగదిలో ఉల్లిపాయలు కనిపిస్తాయి. శాఖాహారుల నుంచి మాంసాహారుల వరకు అందరూ ఉల్లిపాయలు తింటారు. ఎందుకంటే ఉల్లిపాయలు లేకుండా ఏ వంట పూర్తికాదు. అంతేకాదు ఇవి లేనితే వంటలకు రుచి కూడా రాదు. దాదాపు ప్రతి ఇంటి వంటగదిలో ఉల్లిపాయలు కనిపిస్తాయి. శాఖాహారుల నుంచి మాంసాహారుల వరకు అందరూ ఉల్లిపాయలు తింటారు. ఎందుకంటే ఉల్లిపాయలు లేకుండా ఏ వంట పూర్తికాదు. అంతేకాదు ఇవి లేనితే వంటలకు రుచి కూడా రాదు. అందుకే చాలా మంది వీటిని అధిక మొత్తంలో మార్కెట్లో కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేసుకుంటూ ఉంటారు. కానీ ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం వల్ల ఉల్లి మొలకెత్తడం చూస్తూనే ఉంటాం. ఇలా మొలకెత్తిన ఉల్లిని తినడం సురక్షితమేనా అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఈ విధంగా మొలకెత్తిన ఉల్లిపాయలను తినకూడదని కొందరు భావిస్తుంటారు. కానీ మరికొందరు మాత్రం మొలకెత్తిన ఉల్లి ఆరోగ్యానికి చాలా మంచిదని, దీనిని తినడంలో ఎటువంటి సమస్య లేదని చెబుతున్నారు. నిల్వ ఉల్లిపాయలకు వచ్చే పచ్చి మొలకలు విషపూరితమైనవి కావు. నిజానికి ఉల్లిపాయ పాతబడి కొంత తేమను పొందినప్పుడు అది మళ్ళీ మొలకెత్తడం ప్రారంభమవుతుంది. రోజులు గడిచేకొద్దీ దాని నుంచి పచ్చని ఆకు ఉద్భవిస్తాయి. ఈ ఆకులు తినడం ఆరోగ్యానికి మంచిది. భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కానీ ఉల్లిపాయలు తినడానికి సురక్షితమే అయినప్పటికీ వాటి లక్షణాలలో కొన్ని మార్పులు సంభవిస్తాయి. ఉల్లిపాయలు మొలకెత్తినప్పుడు, లోపలి భాగం కొద్దిగా మృదువుగా, లేతగా మారుతుంది. ఈ ఉల్లిపాయలు సాధారణ ఉల్లిపాయల మాదిరిగా రుచిగా ఉండకపోవచ్చు. వాటికి కొంచెం చేదు రుచి ఉంటుంది. మీరు వంట చేసేటప్పుడు మొలకలను కోసి సలాడ్లు వంటి ఇతర ఆహారాలలో వాడవచ్చు. వాటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. వాటిని తినడం ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ మొలకెత్తిన ఉల్లిపాయ నొక్కినప్పుడు చాలా మృదువుగా లేదా పొడిగా ఉంటే, అలాగే వాటిపై నల్ల మచ్చలు ఉంటే అలాంటి వాటిని ఉపయోగించవద్దు. ఇటువంటి ఉల్లిపాయలు ఆరోగ్యానికి ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

## బిపి కంట్రోల్ అవ్వట్లేదా? వీటిని తినాల్సిందే!



ఉపవాస సమయాల్లో మనకు మొదట గుర్తుకు వచ్చే ఆహారం 'సగ్గుబియ్యం'. కేవలం సంప్రదాయ వంటకం మాత్రమే కాదు, సగ్గుబియ్యం అద్భుతమైన పోషక విలువల గని. మీకు తరచుగా అలసటగా అనిపిస్తోందా? జీర్ణ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారా? అయితే మీ డైట్‌లో సగ్గుబియ్యాన్ని చేర్చుకోవాల్సిందే! కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉండే ఈ 'టపియోకా ముత్యాలు' తక్షణ శక్తిని ఇవ్వడమే కాకుండా, రక్తపోటును నియంత్రించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. సగ్గుబియ్యం తినడం వల్ల కలిగే 5 అద్భుత ప్రయోజనాలు మీకోసం. సగ్గుబియ్యం కేవలం ఉపవాస ఆహారం మాత్రమే కాదు, ఇది ఒక పోషకాల బాండాగారం. ఖిచ్డీ, వడలు, పాయసం వంటి వివిధ రూపాల్లో తీసుకునే సగ్గుబియ్యం శరీరానికి అనేక రకాలుగా మేలు చేస్తుంది. 1. తక్షణ శక్తికి మూలం: సగ్గుబియ్యంలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. మీరు నీరసంగా లేదా అలసటగా ఉన్నప్పుడు, పాలతో కలిపి సగ్గుబియ్యం తీసుకుంటే శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. అందుకే ఉపవాసం ఉన్నవారు దీనిని ఎక్కువగా ఇష్టపడతారు. 2. బరువు పెరగాలనుకునే వారికి వరం: ఎంత తిన్నా బరువు పెరగని వారు సగ్గుబియ్యాన్ని తమ ఆహారంలో చేర్చుకోవాలి. ఇందులో ఉండే కేలరీలు మరియు కార్బ్స్ ఆరోగ్యకరమైన రీతిలో బరువు పెరగడానికి సహకరిస్తాయి. 3. మెరుగైన జీర్ణక్రియ: సగ్గుబియ్యం చాలా తేలికగా జీర్ణమవుతుంది. ఇది ప్రేగుల కదలికను సులభతరం చేస్తుంది. మలబద్ధకం మరియు గ్యాస్ సమస్యలతో బాధపడేవారు సగ్గుబియ్యం తీసుకోవడం వల్ల మంచి ఉపశమనం పొందుతారు. ఇది ప్రేగుల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. 4. బలమైన ఎముకలు: సగ్గుబియ్యంలో కాల్షియం మరియు మెగ్నీషియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. క్రమం తప్పకుండా దీనిని తీసుకోవడం వల్ల ఆస్టియోపోరోసిస్ మరియు కీళ్ల నొప్పుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. 5. రక్తపోటు నియంత్రణ: నేటి కాలంలో హై బీపీ సర్వసాధారణం అయిపోయింది. సగ్గుబియ్యంలో ఉండే పొటాషియం రక్త ప్రసరణను మెరుగుపరిచి, రక్తపోటును నియంత్రణలో ఉంచడానికి సహాయపడుతుంది.

## చలికాలంలో అరటి పండ్లు తినడం మంచిదేనా?



శీతాకాలంలో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఈ కాలంలో అనేక ఆరోగ్య సమస్యలు చుట్టూ ముడతాయి. అందుకే ఈ కాలంలో తీసుకునే ఆహారంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ క్రమంలో చాలా మందికి శీతాకాలంలో అరటిపండ్లు తినాలా? శీతాకాలంలో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఈ కాలంలో అనేక ఆరోగ్య సమస్యలు చుట్టూ ముడతాయి. అందుకే ఈ కాలంలో తీసుకునే ఆహారంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ క్రమంలో చాలా మందికి శీతాకాలంలో అరటిపండ్లు తినాలా? వద్దా? అనే సందేహం కలుగుతుంది. నిజానికి అరటిపండ్లు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అరటిపండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి. అరటిపండ్లు పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ ప్రయోజనకరంగా ఉంటాయి. అరటిపండ్లలో పోషకాలు పుష్కలంగా ఉండటమే అందుకు కారణం. అయితే శీతాకాలంలో అరటిపండ్లు తినడం ప్రయోజనకరంగా ఉందా? లేదా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఎందుకంటే చలికాలంలో అరటిపండ్లు తినడం వల్ల జలుబు, దగ్గు వస్తుందని పలువురి నమ్మకం. నిపుణుల అభిప్రాయం ప్రకారం శీతాకాలంలో వీలైనంత వరకు అరటిపండ్లు తినడం మానుకోవాలి. అరటి పండ్లు తినడం మరింత చలిని కలిగిస్తాయి. చల్లని వాతావరణంలో అరటి ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ముఖ్యంగా జలుబు వచ్చే అవకాశం ఎక్కువ. అరటిపండ్లు తినాలని అనిపిస్తే మధ్యాహ్నం వేళల్లో తినడం మంచిది. శీతాకాలంలో రాత్రి, ఉదయం వేళల్లో అరటిపండ్లు తినకపోవడమే మంచిది. ఎందుకంటే ఈ సమయాల్లో అరటి పండ్లు తినడం వల్ల జలుబు, దగ్గు వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# యూఎస్ మార్కెట్‌లో బాలయ్య అరుదైన ట్రాక్ రికార్డు!




నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా సంయుక్త మీనన్ హీరోయిన్ గా దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన అవైటెడ్ సీక్వెల్ చిత్రమే అఖండ 2. కొన్నేళ్ల కితం వచ్చి సంచలన విజయం సాధించిన అఖండ 1 కి సీక్వెల్ గా ఈసారి తాండవం అంటూ వచ్చిన ఈ సినిమా మంచి ఓపెనింగ్స్ సాధించింది. అయితే జరిగిన అంత నెగిటివ్ లో కూడా బాలయ్య రికార్డులు సెట్ చేశారు.

బాలయ్యకి అఖండ 1 తో మొదలైన విజయాల పరంపర మెయిన్ గా యూఎస్ మార్కెట్ లో 1 మిలియన్ గ్రాస్ వసూళ్లు హవా ఇప్పుడు అఖండ 2 తో సెన్సేషన్ గా మారింది మొత్తం 5 సినిమాలూ వరుసగా 1 మిలియన్ మార్క్ ని నార్త్ అమెరికాలో అందుకున్నాయి. (అఖండ 1, వీర సింహా రెడ్డి, భగవంత్ కేసరి, డాకు మహారాజ్,అఖండ 2 ) ఇలా నాలుగు వరుస సినిమాలు 1 మిలియన్ మార్క్ దాటడం అనేది వెరీ రేర్. మన టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోస్ లో ఇప్పుడు బాలయ్య నార్త్ అమెరికా వసూళ్లలో ముందున్నారని చెప్పొచ్చు. అక్కడ లాస్ట్ 5 సినిమాలు మాత్రమే కాకుండా గౌతమి పుత్ర శాతకర్ణి సినిమాతో మొత్తం 6, మిలియన్ సినిమాలు ఉన్న ఏకైక సీనియర్ హీరోగా యూనిక్ ట్రాక్ రికార్డు తాను సొంతం చేసుకున్నారు.




# ‘ది రాజాసాబ్’ ట్రైలర్ పై మేకర్స్ క్లారిటీ !

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ‘ది రాజాసాబ్’ సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా నిన్న హైదరాబాద్ లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఐతే, ఈ సినిమా ట్రైలర్ ఈరోజే విడుదలవుతుందని చిత్ర నిర్మాతలు ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ప్రకటించారు. కాగా ట్రైలర్ విడుదలపై అప్‌డేట్ కోసం అభిమానులు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. పెరుగుతున్న ఈ సందడి మధ్య, ట్రైలర్ పూర్తిగా సిద్ధమైన తర్వాతే విడుదల చేస్తాం అని టీమ్ క్లారిటీ ఇచ్చింది. కాగా ఖచ్చితమైన విడుదల తేదీ మరియు సమయం తమ అధికారిక ప్లాట్‌ఫామ్‌ల ద్వారా మాత్రమే ప్రకటిస్తామని చిత్ర బృందం హామీ ఇచ్చింది. మొత్తానికి అభిమానులు ఈ సినిమా ట్రైలర్ కోసం మరికొంత కాలం వేచి ఉండాల్సిందే.

ఇక ఈ సినిమాలో సంజయ్ దత్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ మరియు రిద్ధి కుమార్ కథానాయికలు. ఈ సినిమా హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం.. ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అవుతోంది.



# నా శరీరంలో ఏదో తేడా కనిపించింది :కియారా

బాలీవుడ్ బ్యూటీ కియారా అడ్వాణీ ఈ ఏడాది ‘వార్ 2’, ‘గేమ్‌ఛేంజర్’ సినిమాలతో తెరపై అలరించింది. ఐతే, ప్రస్తుతం తల్లిగా మాతృత్వపు దశను ఆస్వాదిస్తూనే.. మరోవైపు రాబోయే ప్రాజెక్టుల కోసం రెడీ అవుతుంది ఈ బ్యూటీ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కియారా.. తన మాతృత్వపు ప్రయాణం గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలు తెలిపింది. కియారా మాట్లాడుతూ.. ‘తల్లి అయ్యాక నా శరీరాన్ని, అందాన్ని చూసే విధానం పూర్తిగా మారిపోయింది. ఇటీవలే విడుదలైన ‘వార్ 2’లోని బికినీ షాట్ కోసం చాలా కష్టపడ్డాను. కానీ డెలివరీ అయ్యాక నా శరీరంలో ఏదో తేడా కనిపించింది’ అని కియారా తెలిపింది.

కియారా ఇంకా మాట్లాడుతూ..’తల్లిని కాకముందే నేను ఉన్నట్లు మళ్లీ ఉండగలనా అనుకున్నా. కానీ ఇక్కడ అందమైన ముఖం, శరీరం ఉండడం ముఖ్యం కాదు. ‘నువ్వు ఒక మనిషిని సృష్టించావు’ అని నా శరీరాన్ని చూసి నాకు చాలా గర్వంగా ఉంది. ఇప్పుడు నేను చూడ్డానికి ఎలా ఉన్నా.. నన్ను నేను గౌరవించుకుంటాను. నాకు మాతృత్వం నేర్పిన పాఠాలు ఇవి’ అంటూ కియారా అడ్వాణీ తెలిపింది. అలాగే కియారా అడ్వాణీ ప్రస్తుతం సినిమాల పై ఫుల్ ఫోకస్ పెట్టింది.


# అందుకే సినిమాలకు స్వస్తి పలుకుతున్నా – విజయ్

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉన్నారు. మరోవైపు విజయ్ సినిమాలకు దూరం కాబోతున్నారంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం నటిస్తున్న ‘జన నాయగన్’ ఆయన ఆఖరి చిత్రమని చర్చ సాగిన సంగతి తెలిసిందే. కాగా ఇదే తన చివరి సినిమా అని స్వయంగా విజయ్ ప్రకటించారు. ‘నా కోసం ఎంతోమంది అభిమానులు, ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసేవారు. ఇంతకాలం నన్ను సపోర్ట్ చేసిన వారి కోసం మరో 30 ఏళ్లు నేను నిలబడతా. ఈ అభిమానులకు సేవ చేయడం కోసమే నేను సినిమాలకు స్వస్తి పలుకుతున్నా’ అని విజయ్ చెప్పుకొచ్చారు.

విజయ్ ఇంకా మాట్లాడుతూ.. ‘తొలి నుంచీ నేనెన్నో విమర్శలు ఎదుర్కొన్నాను. అభిమానులు మాత్రం నన్ను ప్రోత్సహించేవారు. 33 ఏళ్లుగా నాకు సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. ఒక చిన్న ఇల్లు అయినా నిర్మించుకోవాలన్న ఆశతో ఇండస్ట్రీలోకి వచ్చా. కానీ, మీరు (అభిమానులు) రాజ భవనం ఇచ్చారు. ఇంతగా నన్ను ఆదరించిన వారికి ఇప్పుడు నేను సపోర్ట్‌గా ఉండాలనుకుంటున్నాను’ అని విజయ్ తెలిపారు.



# రోషన్‌కి మరో ఆఫర్ !



యంగ్ హీరో రోషన్ హీరోగా స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో ‘ఛాంపియన్’ సినిమా వచ్చింది. ఈ సినిమాలో రోషన్ నటనతో పాటు తన లుక్స్ కి కూడా మంచి పేరు వచ్చింది. ఐతే, తాజాగా రోషన్‌కు మరో భారీ ఆఫర్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో రోషన్ ఓ సినిమా చేయబోతున్నాడు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ.. దర్శకుడు శైలేష్ కొలను దర్శకత్వంలో రోషన్ హీరోగా సినిమా చేయబోతున్నట్లు తెలిపారు.

నిర్మాత నాగవంశీ ఈ సినిమా గురించి ఇంకా మాట్లాడుతూ.. ‘రోషన్ కోసం శైలేష్ కొలను ఫుల్ ఎంటర్ టైనర్ స్క్రిప్ట్ రాసినట్లు చెప్పారు. శైలేష్, న్యాచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘హిట్ 3’ బాగానే ఆడింది. ఐతే, ఆ సినిమా ఫుల్ యాక్షన్ మోడ్ లో సాగింది. మరి ఇప్పుడు శైలేష్, రోషన్ తో ఎలాంటి కామెడీ సినిమా చేస్తాడో చూడాలి. మొత్తానికి, ‘ఛాంపియన్’ సినిమాతో రోషన్ కెరీర్ కొత్త దశలోకి అడుగుపెట్టినట్టే కనిపిస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in